
ఆదోని మండలం నాగనాథనహళ్లి సమీపంలోని ఆస్పరి రక్షిత మంచినీటి పథకం ఎస్ఎస్ ట్యాంక్


పనుల్లో నాణ్యత సాధ్యమేనా..?

కర్నూలు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వంద రూపాయలతో చేయాల్సిన ఒక పనిని రూ.60లకు చేస్తే.. నాణ్యతా ప్రమాణాలు గంగలో కలుస్తాయి. ప్రభుత్వ కార్యకలాపాల్లోని మాయాజాలం వల్ల విచిత్రాలు ఎన్నయినా జరుగుతాయి. ఉమ్మడి జిల్లాలో గ్రామీణ తాగునీటి సరఫరా కోసం సమగ్ర రక్షిత మంచి నీటి పథకాల (సీపీడబ్ల్యూఎస్) నిర్వహణలో ఇలాంటివి కనిపిస్తున్నాయి. ఈ విభాగంలో ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ స్టాండర్డ్ రేట్స్ (ఎస్ ఎస్ఆర్) ప్రకారం టెండర్లు పిలిచారు. 10 శాతం వరకు తక్కువ ధరలకు టెండర్లు వేయడం సహజం. 25 శాతం వరకు ప్రభుత్వం అనుమతి ఇస్తుంది. ఏకంగా 40 శాతం తక్కువకే తాగునీటి సరఫరా చేస్తాం అంటూ పలు స్కీంలకు కాంట్రాక్టర్లు షెడ్యూల్ దాఖలు చేశారు. ఇది ఎలా సాధ్యం..? అని ఇంజనీర్లే ప్రశ్నిస్తున్నారు. ఎలాగైనా పనులు దక్కించుకొని ఆ తరువాత ఇంజనీర్లు, అధికార కూటమి ప్రజా ప్రతినిధుల అండతో మాయ చేయవచ్చేనే ఉద్దేశంతో టెండర్లు వేసి ఉంటారనే ఆరోపణలు లేకపోలేదు. దీని వెనుక ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారి పాత్ర ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టెండర్లు పూర్తై 20 రోజులైనా కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్ చేసుకోలేదు. ఈ వివరాలపై ప్రత్యేక కథనం.

- 40 శాతం తక్కువకు టెండర్లు
- పనుల్లో నాణ్యత సాధ్యమేనా?
- ఉమ్మడి జిల్లాలో 44 సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు
- నిర్వహణకు రూ.40.07 కోట్లతో టెండర్లు
- పలు స్కీంలకు 40.01 శాతం తక్కువ ధరలకు షెడ్యూల్ దాఖాలు
- పల్లె ప్రజలకు తాగునీటి సరఫరాలో మాయాజాలం


మంత్రాలయం మండలం సూగూరు ఎస్ఎస్ ట్యాంక్

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో గ్రామీణ తాగునీరు సరఫరా, పారిశుధ్యం శాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) పర్యవేక్షణలో 60 సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు (సీపీడబ్ల్యూఎస్) ఉన్నాయి. 555 గ్రామాలకు శుద్ధి చేసిన (ఫిల్టర్) తాగునీరు అందిస్తున్నారు. వీటి నిర్వహణకు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) గ్రాంట్ కింద ప్రభుత్వం ఏటేటా రూ.85.71 కోట్లకు పైగా ఖర్చు చేస్తుంది. కర్నూలు జిల్లాలో 354 గ్రామాలకు తాగునీటి సరఫరా కోసం 33 సీపీడబ్ల్యూఎస్ స్కీంల నిర్వహణకు రూ.49.29 కోట్లు ఖర్చు చేస్తున్నారు. నంద్యాల జిల్లాలో 201 గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంగా 27 సీపీడబ్ల్యూఎస్ స్కీంల నిర్వహణకు రూ.36.42 కోట్లు ఖర్చు చేస్తున్నారు. జిల్లా పరిషత్ (జడ్పీ) నిధులు మంజూరు చేసి పరిపాలన అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. తాగునీటి పథకాలు నిర్వహణ, తాత్కాలిక మరమ్మతులు, సిబ్బంది జీతాలు, విద్యుత్ బిల్లులు కోసం నిధులు వెచ్చించాలి. నిర్వహణ బాధ్యతలు టెండర్లు ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగిస్తారు. ఆయా సీపీడబ్ల్యూఎస్ స్కీంల ద్వారా గ్రామాలకు శుద్ధి చేసిన తాగునీరు సరఫరా చేస్తే.. ఎస్ఎస్ ట్యాంకు, ఫిల్టర్ బెడ్స్ నుంచి నీటి సరఫరా చేసే గ్రామాలకు మధ్య దూరాన్ని బట్టి కిలో లీటరు (1,000 లీటర్లు)కు కనిష్ఠంగా రూ.6.24 గరిష్ఠంగా రూ.14 చెల్లిస్తారు. రోజు వారిగా ఏ గ్రామానికి ఎంత నీటిని సరఫరా చేశారో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎం-బుక్ రికార్డులు చేసి బిల్లులు చెల్లించాలి.


కౌతాళం సమగ్ర రక్షిత మంచినీటి పథకం (సీపీడబ్ల్యూఎస్) ఎస్ఎస్ ట్యాంక్

● 40.01 శాతం తక్కువ రేట్లకు టెండర్లు:
కర్నూలు జిల్లాలో 25, నంద్యాల జిల్లాలో 19 సీపీడబ్ల్యూఎస్ స్కీంలు 2025-26లో నిర్వహణకు రూ.40.07 కోట్లతో గత నెల (మార్చి) 3న ఏపీ ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్ ఏటీఓ/81 నుంచి 124/2024-25 కింద గ్రామీణ తాగునీరు సరఫరా, పారిశుధ్యం శాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) సూపరింటెండెంట్ ఇంజనీరు (ఎస్ఈ) టెండర్లు పిలిచారు. అదే నెల 12వ తేది నుంచి టెండరు బిడ్ షెడ్యూల్ డౌన్‌లోడ్ చేసుకొని.. ఆఖరు తేది 25వ తేదిలోగా ఆన్‌లైన్‌లో టెండరు షెడ్యూల్ దాఖలు చేశారు. అదే రోజు టెక్నికల్ బిడ్, ఆ తరువాత ప్రైజ్ బిడ్ ఓపన్ చేశారు. ఇంజనీర్లే విస్తుపోయేలా ఆదోని డివిజన్ పరిధిలో పెసలబండ, కుప్పగల్, హాల్వి, కౌతాళం, సాతనూరు, మండిగిరి సమగ్ర రక్షిత మంచినీటి పథకాలకు ఓ కాంట్రాక్టర్ ఏకంగా ప్రతిపాదన టెండర్ రేట్లకు 40.01 శాతం తక్కువ ధరలకు టెండరు షెడ్యూల్ దాఖలు చేశారని ఇంజనీర్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం 25 శాతం వరకు తక్కువ ధర (లెస్)కు టెండర్ వేస్తే ఆమోదిస్తారు. లెస్‌కు 25 శాతం కంటే ఎంత ఎక్కువ వేశారో.. ఆ మొత్తాన్ని కాంట్రాక్టర్ డిపాజిట్ చేశాకే అగ్రిమెంట్ చేసుకోవాలి. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే తాగునీటి పథకాల నిర్వహణలో కాంట్రాక్టర్లు ప్రతిపాదన రేట్ల కంటే 40 శాతం తక్కువకే నీటిని సరఫరా చేయడం సాధ్యమేనా..? టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక జరిగిన తొలి జడ్పీ సమావేశంలో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఇదే అంశంపై గట్టిగా నిలదీస్తే ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సరైన సమాధానం చెప్పలేకపోయారు. ఇందులో మర్మమేమిటో నిగ్గు తేల్చాలని

మిగతా 6లో..

ఇకపై వాట్సాప్ గవర్నెన్స్ సేవలు

- ప్రజల్లో అవగాహన కల్పించండి
- కలెక్టర్ పి. రంజిత్ బాషా


ఏపీ ప్రభుత్వం వాట్సాప్ సేవలు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రజల కోసం వినియోగంలోకి తీసుకొచ్చామని కలెక్టర్ పి. రంజిత్ బాషా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ఏపీ ప్రభుత్వం వాట్సాప్ సేవలు పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న వివిధ పౌరసేవలు మరింత చేరువ చేయడానికి వాట్సాప్ గవర్నెన్స్‌ను 9552300009 నెంబరు ద్వారా తీసుకు వచ్చామని అన్నారు. ఏప్రిల్ 15వ తేదీ నుంచి ఇంటి వద్ద నుంచే పౌరసేవలు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభం అయ్యాయని తెలిపారు. ఈ వేదిక ద్వారా ప్రజలు ధృవపత్రాలు, లైసెన్సులు, పన్నుల చెల్లింపులు, బిల్లులు, దేవాలయ దర్శనాలు, పరీక్ష ఫలితాలు వంటి 250కి పైగా సేవలను పొందవచ్చన్నారు. ఇళ్లకు వెళ్లి వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను అందించాలన్నారు. అదే విదంగా శక్తి యాప్, సైబర్ నేరాలపైన కూడా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు అర్జీలను చూడాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. పీజీఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని, అదే విధంగా రీఓపెన్ అయిన అర్జీలపై కూడా ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు.

విచారణ జరిపి న్యాయం చేస్తాం

ఎస్పీ విక్రాంత్ పాటిల్

- పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 128 ఫిర్యాదులు


బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

కర్నూలు క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. స్థానిక కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 128 ఫిర్యాదులు వచ్చాయని అన్నారు. వీటిపై విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుశేన్‌పీరా, సీఐలు పాల్గొన్నారు.

డీవీఈఓగా సురేష్‌బాబు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు డీవీఈఓగా శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబును నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఇంటర్మీడియట్ బోర్డు ప్రధాన కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు సీనియర్ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న పరమేశ్వరరెడ్డి ఇన్‌చార్జి డీవీఈఓగా కొనసాగుతూ వచ్చారు. సురేష్‌బాబును రెగ్యులర్ అధికారిగా నియమిస్తూ ఉత్వర్వులు జారీ అయ్యాయి.

అభివృద్ధి, సంక్షేమమే చంద్రబాబు లక్ష్యం

- నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి
- టీజీవీ కళాక్షేత్రంలో చంద్రబాబు జన్మదిన వారోత్సవాలు

ఫలితాల టెన్‌షన్..

- రేపు పది పరీక్షా ఫలితాలు
- ఉదయం 10 గంటలకు విడుదల



నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న పదో తరగతి పరీక్షా ఫలితాల మరో 24 గంటల్లో విడుదల కానున్నాయి. పరీక్షలు ముగిసిన 22 రోజుల్లోనే ఫలితాల విడుదలకు ప్రభుత్వం సన్నద్ధమైంది. ఫలితాలను 23వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం డైరక్టర్ శ్రీనివాసరెడ్డి ప్రకటన విడుదల చేశారు.

● మన మిత్ర ద్వారా ఫలితాలు
విద్యార్థులు మన మిత్ర వాట్సాప్ నుంచి ఫలితాలు పొందవచ్చు. 9552300009 నంబర్‌కు 'హాయ్' అని మెసేజ్ పంపి, ఆ తర్వాత విద్యాసేవలను ఎంచుకుని, ఆపై ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఎంచుకోవాలి. అనంతరం వారి రోల్‌నంబర్‌ను నమోదు చేయడం ద్వారా ఫలితాల పీడీఎఫ్ కాపీని పొందవచ్చు. అలాగే సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాల లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

పశుగ్రాసానికి నిధులు

- ఉమ్మడి జిల్లాలో 20వేల ఎకరాల్లో గ్రాసం పెంపు
- ఉపాధి హామీ నిధులతో పాడి పశువులకు పుష్కలంగా మేత


పాడి పశువుల కోసం పచ్చికబయళ్లు గ్రాసం

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వేసవిలో రైతులు పాడి పశువుల పోషణ భారం భరించలేకపోతున్నారు. పశువులను పస్తులు పెట్టలేక సంతకు తీసుకెళ్లి కబేళాలకు విక్రయిస్తున్నారు. ఈ పరిస్థితులను గుర్తించిన కూటమి ప్రభుత్వం పాడి పశువులకు సమృద్ధిగా గ్రాసం (గడ్డి) అందించేందు కోసం ఉపాధి నిధులను పెద్ద ఎత్తున వినియోగించేందుకు చర్యలు తీసుకుంది. గతంలో వైసీపీ ప్రభుత్వం జిల్లా వేయి ఎకరాల్లో మాత్రమే గ్రాసాన్ని పెంచేందుకు ఉపాధి నిధులను నామమాత్రంగా వినియోగించింది. దీంతో గ్రాసం తగినంత అందుబాటులో లేక వ్యాపారుల నుంచి కొనుగోలు చేయలేక అప్పట్లో రైతులు పాడి పశువులను సంతలకు తీసుకెళ్లి అమ్మేసేవారు. కూటమి ప్రభుత్వం రావడంతో పెద్ద ఎత్తున గ్రాసం పెంపకానికి ఉపాధి నిధులు వెచ్చించడం ద్వారా ప్రస్తుత వేసవిలో పాడిగేదెలకు పూర్తి స్థాయిలో గ్రాసాన్ని అందుబాటులో తెచ్చేందుకు ఏర్పాట్లు చేసింది. 10 సెంట్ల నుంచి 50 సెంట్ల విస్తీర్ణంలో గ్రాసాన్ని పెంచుకునే రైతులకు రూ.33వేలు ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా అందించేందుకు ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఒక్కో మండలానికి 300 ఎకరాల చొప్పున పశుగ్రాసాన్ని పెంచేందుకు లక్ష్యాన్ని పశుసంవర్ధక శాఖకు నిర్దేశించింది. కర్నూలు, నంద్యాల జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంటున్న మండలాల్లో పశుగ్రాసాన్ని పెంచేందుకు మొదటి ప్రాధాన్యత కింద ఆయా మండలాల్లో ఉపాధి నిధులను వెచ్చించేందుకు అధికారులు ప్రస్తుతం చర్యలు చేపట్టారు. వచ్చే ఏప్రిల్ నాటికి ఉమ్మడి జిల్లాలో 20వేల ఎకరాల్లో పశుగ్రాసాన్ని పెంచే కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని కర్నూలు, నంద్యాల జిల్లాల పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. రెండు జిల్లాలో 5 లక్షల దాకా పాడి పశువులు ఉన్నట్లు వారు తెలిపారు.

● రైతులకు సువర్ణావకాశం
ఉపాధి నిధుల ద్వారా రైతులు, పాడిగేదెల పెంపకందారులు పశుగ్రాసాన్ని పెంచేందుకు నిధులను పెద్ద ఎత్తున ప్రభుత్వం కేటాయించనుంది. మార్గదర్శకాలు ఇంకా మాకు అందలేదు. వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటాం.
- శ్రీనివాస్, జేడీ, కర్నూలు

పెరిగిన పత్తి ధర

- క్వింటా గరిష్ఠంగా రూ.8,179


విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పత్తి ధరలు వారం రోజులుగా పైకి ఎగబాకుతున్నాయి. సోమవారం పత్తి ధర క్వింటా గరిష్ఠంగా రూ.8,179 పలికింది. గత వారంతో పోల్చితే రూ.200పైగా పెరిగినట్లయింది. పత్తి జిన్నింగ్ ప్రెస్సింగ్ పరిశ్రమలకు ఉత్పత్తికి అవసరమైన పత్తి మార్కెట్‌కి రాకపోవడంతో వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. దీంతో పత్తికి డిమాండ్ వచ్చి ధరల పెరుగుదలకు కారణమైంది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లోను దూది గింజల ధరలు స్వల్పంగా పెరిగాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. 661 క్వింటా పత్తి విక్రయానికి రాగా కనిష్ఠ ధర రూ.4,509 గరిష్ఠ ధర రూ.8,179, సగటున రూ.7,589 పలికింది.

ఉపాధి పనులు 150 రోజులు

- కేంద్రానికి సిఫారసు చేసిన పార్లమెంటరీ కమిటీ



కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా రోజూ పనులు చేపట్టే రైతులు, కూలీలకు ప్రస్తుతం అందిస్తున్న వేతనంతో పాటు పని దినాలు వంద రోజులు ఏ మాత్రం సరిపోవడం లేదని అందువల్ల కూలీ మొత్తాన్ని రూ.400కు పెంచడంతో పాటు, పనుల కాలాన్ని 150 రోజులకు పెంచాలని కేంద్ర ప్రభుత్వానికి పార్లమెంటరీ కమిటి సిఫారసు చేసినట్లు కర్నూలు జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికార వర్గాలు తెలిపాయి. పార్లమెంటరీ కమిటి చేసిన సిఫారసుల మేరకు త్వరలోనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుందని, కొంతలో కొంతైనా ప్రయోజనం చేకూరే అవకాశం ఉన్నట్లు వారు తెలిపారు. పథకం పనితీరు, వేతనాలు, నిధుల విడుదలతో పాటు పని ప్రదేశంలో సౌకర్యాలు అంచనా వేసేందుకు స్వతంత్ర దర్యాప్తు సంస్థతో దేశ వ్యాప్తంగా సమగ్ర సర్వే నిర్వహించాలని, ఈ పార్లమెంటరీ కమిటి కేంద్ర ప్రభుత్వానికి సూచించినట్లు నీటి యాజమాన్య సంస్థ అధికార వర్గాలు తెలిపాయి.

● కూలీలకు మేలు :
ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే పార్లమెంటరీ కమిటి పనిదినాలను పెంచాలని వేతనాన్ని పెంచాలని సిఫారసు చేయడం, అది అమలులోకి వస్తే కూలీలకు ఆర్థికంగా కలసి రానుందని రైతు సంఘాల ప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు పనిదినాల పెంపు కోసం అధికారులు తిరిగి పనుల గుర్తింపుతో పాటు గ్రామసభలు నిర్వహించాల్సి ఉంటుందని, నీటి యాజమాన్య సంస్థ అధికార వర్గాలు తెలిపాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 5 లక్షల కుటుంబాలకు జాబ్‌కార్డులను అందజేయడం జరిగింది. కర్నూలు జిల్లాలో ప్రస్తుతం ప్రతిరోజు 90వేల మంది, నంద్యాల జిల్లాలో 60వేల మంది ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

● కూలీ పెంపుపై కేంద్రం నిర్ణయం తీసుకోవాలి
ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు లబ్ధి కోసం పార్లమెంటరీ స్థాయి కమిటీ సిఫారసులు చేసింది. కేంద్రం ఈ సిఫారసులపై ఎంతవరకు నిర్ణయం తీసుకుంటుందో తెలియలేదు. సిఫారసులు అమలైతే ఉమ్మడి జిల్లాలో 5లక్షల మంది రైతులు, రైతుకూలీలకు లబ్ధి చేకూరుతుంది.
- వెంకటరమణయ్య, డ్వామా పీడీ

పూల పరిమళాలు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ వివిధ రంగుల, పరిమళాల పూలతో కళకళలాడుతోంది. నిజానికి ఇది సాధారణ పూల వినియోగ కాలం కాదు. పండుగలు అయిపోయాయి.. పెళ్లి ముహూర్తాలు పెద్దగా లేవు...శుభకార్యాలు అంతంత మాత్రమే. దీంతో పూల ధరలు అమాంతం తగ్గిపోయాయి. కొనుగోళ్లు కూడా తగ్గాయి. అయినామార్కెట్‌లో తాజా పూలు ఘుమ ఘుమలాడుతున్నాయి. మరోవైపు వాతావరణం అనుకూలించడంతో పూల దిగుబడి ఇబ్బడిముబ్బడిగా పెరిగి అన్ని రకాల పుష్పాలు వినియోగదారులకు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఈ పరిస్థితులు పూల రైతును దారుణంగా దెబ్బతీస్తున్నాయి. దిగుబడి ఉన్నా తగినంత ధర లేకపోవడం, ఉపాధి పనులతో కూలీలు దొరకకపోవడం వల్ల ఒకవైపు రైతులు, అమ్మకాలు లేక వ్యాపారులు విలవిలలాడిపోతున్నారు.

- మార్కెట్‌లోకి వివిధ రకాల పూలు
- దిగివచ్చిన ధరలు
- నంద్యాల జిల్లాలో 3వేల హెక్టార్లలో పూలసాగు
- ప్రతిరోజూ టన్ను పూలను విక్రయిస్తున్న వ్యాపారులు




జాజిపూలతోట

● జిల్లాలో 3వేల హెక్టార్లలో పూలసాగు

నంద్యాల జిల్లాలో 3వేల హెక్టార్లలో రైతులు పూలను సాగుచేస్తున్నారు. నంద్యాల కేంద్రంగా ప్రతి రోజు టన్ను పూలు అమ్ముడవుతున్నాయి. ప్యాపిలి, డోన్, బేతంచర్ల, పాణ్యం, చాగలమర్రి తదితర మండలాల్లో అధిక ధరలున్న మల్లెపూలు, కనకాంబరాలు, చామంతులు అత్యధికంగా పూలను సాగుచేశారు. వాటితో పాటు మిగిలిన మండలాల్లో కూడా బంతిపూలు, లిల్లీపూలు, గులాబీలు, జాజిపూలు 909 హెక్టార్లలో సాగు చేస్తుండగా 18,009 టన్నుల దిగుబడి వచ్చింది. ప్రతిరోజు మార్కెట్‌కు రెండు టన్నుల మేర చేరుకుంటోంది. దీంతో ఒక్కసారిగా మార్కెట్ పడిపోయింది..



మార్కెట్‌లోకి అనేక రకాల పూలు విక్రయానికి వస్తున్నాయి. ఒకేసారి పెద్ద మొత్తంలో పంట చేతికిరావడంతో ధరలు తగ్గిపోయాయని వ్యాపారులు వాపోతున్నారు. కిలో రూ.500 నుంచి రూ.800 ధర పలికిన మల్లెపూలు నేడు రూ.200లతో గొల్లుమంటున్నాయి. కనకాంబరాలు సీజన్‌లో రూ.600 నుంచి రూ.800 వరకు విక్రయించేవారు. నేడు రూ.200 నుంచి రూ.250కు ధర పడిపోయింది. గులాబీలు కిలో రూ.300 నుంచి రూ.350 వరకు ఉండగా నేడు రూ.150కు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ప్రస్తుతం లిల్లీపూలు కేజీ రూ.150, చామంతి పూలు రూ.200, జాజి పూలు రూ.250 నుంచి రూ.300కు కొద్ది ధరల తేడాతో విక్రయిస్తున్నారు. మిగిలిన పూల పరిస్థితి మరింత దిగజారింది. మన జిల్లాలో పూలకు మార్కెట్ దారుణంగా ఉండడంతో చాగలమర్రి, కానగూడూరు గ్రామాల రైతుల నుంచి వ్యాపారులు జాబిపూలు, మల్లెపూలు, కనకాంబరాలను కొనుగోలు చేసి ముంబాయికి ఎగుమతి చేస్తున్నారు. కర్నూలు జిల్లా కంటే నంద్యాల జిల్లాలోనే అత్యధికంగా పూలసాగు చేస్తున్నారు.

మండలం	సాగు హెక్టార్లలో	పంట దిగుబడి (టన్నుల్లో)
మల్లెపూలు		
చాగలమర్రి	314	3,454
ప్యాపిలి	58	638
డోన్	50	550
రుద్రవరం	40	440
శిరువెళ్ల	42	460
బేతంచర్ల	28	308
ఇతర మండలాలు	218	2,380
మొత్తం	**750**	**8,230**
చామంతులు		
డోన్	513	26,676
బేతంచర్ల	390	20,280
ప్యాపిలి	60	3,120
ఇతర మండలాలు	68	3,546
మొత్తం	**1031**	**53,622**
కనకాంబరాలు		
డోన్	90	360
ప్యాపిలి	35	140
ఇతర మండలాలు	89	356
మొత్తం	**214**	**856**

● మార్కెట్ లేదు



నంద్యాల మార్కెట్‌లో డిమాండ్ బాగున్నప్పుడు టన్ను నుంచి టన్నున్నర వరకు పూలు అమ్మాము. జిల్లాలో పూల దిగుబడి అధికంగా ఉంది. దీంతో ఒకేసారి అన్నిరకాల పూలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. మార్కెట్ ఒక్కసారిగా పడిపోయింది.

- ఫారూక్, హోల్‌సేల్ పూల వ్యాపారి, నంద్యాల.

● దిగుబడి అధికంగా వచ్చింది



జిల్లాలో ఈ ఏడాది పూలు అధికంగా దిగుబడి వచ్చాయి. మార్కెట్ లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాము. నేను ఐదు ఎకరాల్లో పూలు సాగు చేస్తున్నాను. ఉపాధి పనులు ఉండడంతో పూలు కోయడానికి కూడా కూలీలు రావడం లేదు. ఉపాధి పనులను రైతులకు అనుసంధానం చేస్తే రైతులు కూడా కోలుకుంటారు. నష్టాల నుంచి బయటపడతారు.

- శ్రీనివాసులు, పూల రైతు, రాయమాల్పురం

● శుభాకార్యాలు లేవు



ఏప్రిల్, మే నెలల్లో పెద్దగా శుభాకార్యాలు, పెళ్లిళ్ల లేకపోవడం వల్లనే పూలను కొనడానికి వినియోగదారులు ముందుకు రావడం లేదు. దీంతో పాటు కర్నాటకతో చిక్‌బళ్లాపూర్, బెంగుళూరు నుంచి పూలు అధికంగా వస్తున్నాయి. వాటికి కూడా పెద్దగా డిమాండ్ లేదు.

- నబీరసూల్, పూలవ్యాపారి, నంద్యాల


పూలవ్యాపారం

బంతిపూల తోట


బొప్పాయే..

- అమాంతంగా పడిపోయిన బొప్పాయి ధరలు
- గత నెల టన్ను రూ.20 వేలు ● ప్రస్తుతం రూ.5 వేలు
- తోటలను దున్నేస్తున్న రైతులు


చిన్నవంగలిలో బొప్పాయి తోటను దున్నేస్తున్న రైతు

చాగలమర్రి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బొప్పాయి ధర లేక రైతులు కుదేలవుతున్నారు. పెట్టుబడి కూడా రాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. నెల రోజుల వ్యవధిలోనే టన్నుకు రూ.15వేలకు పైగా ధర పడిపోవడంతో రైతులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. చాగలమర్రి మండలంలోని చిన్నవంగలి గ్రామంలో సోమవారం కొందరు రైతులు ఆశలు వదులుకొని బొప్పాయి తోటలను ట్రాక్టర్లతో దున్నేస్తున్నారు. ఎకరాకు రూ.లక్ష దాక వ్యయం చేశామని, ధర లేక బొప్పాయి కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు వెంకటరెడ్డి, నరసింహులు, రమణారెడ్డి, నాగిరెడ్డి, జయరామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 30 ఎకరాల దాక బొప్పాయి తోటలను తొలగించి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. గత నెలలో టన్ను బొప్పాయి రూ.20 వేలు పలికిందని, ప్రస్తుతం ధర రూ.5 వేలకు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బొప్పాయి కాయలు చెట్లకు ఉన్నా పెట్టుబడులు కూడా రావని ట్రాక్టర్లతో దున్నేస్తున్నట్లు తెలిపారు. పంట దిగుబడి ఉన్నా ధర పతనంతో నష్టపోయామని రైతులు వాపోయారు. అధిక వర్షాలు, వైరస్ వల్ల కూడా తోటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.


ధర లేక పొలంలోనే వదిలేసిన బొప్పాయి కాయలు

అభివృద్ధి, సంక్షేమమే చంద్రబాబు లక్ష్యం

- నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి
- టీజీవీ కళాక్షేత్రంలో చంద్రబాబు జన్మదిన వారోత్సవాలు


మాట్లాడుతున్న ఎంపీ శబరి

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన సందర్భంగా కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో 'చంద్రబాబు వజ్రోత్సవ జన్మదిన వారోత్సవాలు' రెండోరోజు సోమవారం కొనసాగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన బైరెడ్డి శబరి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయ నేతలు చంద్రబాబు జన్మదినోత్సవాన్ని ఒక్కరోజు జరిపి అలసిపోయారని, కానీ కర్నూలు కళాకారులు వారం రోజుల పాటు నిర్వహించడం అభినందనీయమన్నారు. గత ఐదేళ్లుగా కళాకారులకు ఎలాంటి పురస్కారాలు, సత్కారాలు లేవని, ఈ ఏడాది చంద్రబాబు కళాకారులను గుర్తించారన్నారు. కళాకారులను గౌరవిస్తే ప్రభుత్వం క్షేమంగా ఉంటుందని అన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు, కళారత్న పురస్కార గ్రహీత పత్తి ఓబులయ్య మాట్లాడుతూ చంద్రబాబు జన్మదిన వజ్రోత్సవ వారోత్సవాలు అవధానంతో ప్రారంభించామని చెప్పారు. యువ ఎంపీ బైరెడ్డి శబరి పార్లమెంటులో రాష్ట్రంలోని రంగస్థల కళాకారుల సమస్యలను కేంద్ర ప్రభుత్వానికి వివరించాలని కోరారు. అనంతరం బైరెడ్డి శబరి ఇటీవల కందుకూరి పురస్కారాలు అందుకున్న రంగస్థల నటులు గాండ్ల లక్ష్మన్న, జీవీ శ్రీనివాసరెడ్డిలను ఘనంగా సత్కరించారు. అలాగే నాటక టెక్నీషియన్లు అయిన హార్మోనిస్టు బలరాముడు, తబలిస్టు మహేష్, కీబోర్డు ప్లేయర్ శ్రీనివాసాచారి, మేకప్‌మెన్ శ్రీనివాసులు, సురభి సంతోషలను సత్కరించారు.



● అలరించిన 'జగదేక సుందరి సామా'

టీజీవీ కళాక్షేత్రంలో ప్రదర్శించిన 'జగదేక సుందరి సామా' పౌరాణిక పద్య నాటకం అసాంతం అలరించింది. పత్తి ఓబులయ్య, దివంగత నాటక రచయిత పల్లేటి కులశేఖర్ సంయుక్తంగా రాసిన ఈ నాటకానికి పత్తి ఓబులయ్య దర్శకత్వం వహించారు. అలనాటి చింతామణి నాటకాన్ని మరపిస్తూ ఈ సామా నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ నాటకంలో ఇటీవల కోర్టు సినిమాలో నటించి పేరుతెచ్చుకున్న సురభి ప్రభావతి, హసీనా, జీవీ శ్రీనివాస రెడ్డి, సంగా ఆంజనేయులు, కె. బాలవెంకటేశ్వర్లు, రాజారత్నం, మహమ్మద్ మియా, గాండ్ల లక్ష్మన్న నటించారు. నాటకంలోని వివిధ సన్నివేశాల్లో సాగే పద్యాలకు ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు.

● నేడు ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ రాక

టీజీవీ కళాక్షేత్రంలో కొనసాగుతున్న చంద్రబాబు జన్మదిన వజ్రోత్సవ సాంస్కృతిక వారోత్సవాల్లో భాగంగా మూడోరోజు మంగళవారం 'శ్రీకృష్ణ కమలపాలిక' పద్య నాటక ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని కళాకారులు తమ సమస్యలను ఛైర్మన్‌కు వినతిపత్రాల ద్వారా వివరించవచ్చని కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు.


నాటక సన్నివేశం


కళాకారుడికి సన్మానం

పనుల్లో నాణ్యత సాధ్యమేనా?

(5వ పేజీ తరువాయి)

పలువురు కోరుతున్నారు. అత్యల్పంగా నంద్యాల జిల్లాలో 44 గ్రామాలకు తాగునీరు అందించే ఆళ్లగడ్డ రక్షిత మంచినీటి పథకం నిర్వహణకు రూ.1.21 కోట్లకు టెండర్లు పిలిస్తే 0.35 శాతం తక్కువ, మెజార్టీ స్కీంలకు 25 శాతం వరకు లెస్‌కు టెండర్లు వేసినట్లు తెలుస్తున్నది.

● అగ్రిమెంట్ చేయడంతో జాప్యం ఎందుకో..?:

టెండర్లు ప్రక్రియ పూర్తి చేసి 21 రోజులు గడిచినా టెండరు దక్కించుకున్న ఎల్-1 కాంట్రాక్టరుతో అగ్రిమెంట్ చేయకపోవడం వెనుక అంతర్యమేమిటి? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. 40 సీపీడబ్ల్యూఎస్ స్కీంలకు టెండర్లు పిలిచారు. అందులో 18 స్కీంలకే కోర్టు కేసులు ఉన్నాయి. మిగిలిన 22 స్కీంలకు కాంట్రాక్టర్లతో ఒప్పందం చేసుకోలేదు. అయితే.. కాంట్రాక్టర్ల నుంచి ఒత్తిడి పెరగడంతో ఆదోని డివిజన్ పరిధిలో 5, నంద్యాల డివిజన్ పరిధిలో 5 స్కీంలకు మాత్రమే రెండు మూడు రోజుల క్రితం అగ్రిమెంట్ చేసినట్లు తెలుస్తుంది. అగ్రిమెంట్ చేయాలంటే టెండరు విలువపై 1-2 శాతం మామూళ్లు ఓ ఉన్నతాధికారి డిమాండ్ చేయడం వల్లేనే జాప్యం జరుగుతుందనే ఆరోపణలు లేకపోలేదు. అంతేకాదు.. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టిన ఆ అధికారికి ఇప్పటికీ ఆ వాసన పోలేదని, వైసీపీ సానుభూతిపరులైన కాంట్రాక్టర్లకే తెరవెనుక మద్దతు ఇస్తూ.. టీడీపీ కూటమి సానుభూతిపరులైన కాంట్రాక్టర్లను లేనిపోని కొర్రీలు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వాస్తవంగా మార్చి 31వ తేదిలోగా టెండర్లు ప్రక్రియ, అగ్రిమెంట్ పూర్తి చేసి ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి సీపీడబ్ల్యూఎస్ స్కీంల నిర్వహణ బాధ్యతలు ఓ అండ్ ఎం కాంట్రాక్టర్లకు అప్పగించాల్సి ఉండేది. జాప్యం ఎందుకో..? అధికారులే సమాధానం చెప్పాలని పలువురు పేర్కొంటున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు వివరణ కోసం ఆంధ్రజ్యోతి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

పర్వతారోహకుడికి ఆర్థిక సాయం


సురేష్‌బాబుకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, జియో మైసూరు కంపెనీ

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నేపాల్ దేశంలోని ప్రపంచంలోనే ఎత్తయిన 7వ ధౌలగిరి శిఖరం అధిరోహించేందుకు మన దేశానికి చెందిన అతి చిన్న వయస్సు పర్వతారోహకుడైన సురేష్‌బాబు అనే వ్యక్తికి ప్రోత్సాహకంగా రూ.లక్ష ఆర్థిక సాయం అందజేసినట్లు కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. జియో మైసూరు కంపెనీ సీఎస్ఆర్ నిధుల కింద ఆర్థిక సాయం అందజేసిందని తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో సురేష్‌బాబుకు రూ.లక్ష చెక్కును కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు జిల్లా గోనెగండ్ల గ్రామ నివాసి అయిన సురేష్‌బాబు (25) చిన్న వయసులోనే ప్రపంచంలోని ఎత్తయిన ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జేసీ డా.బి.నవ్య, డీఆర్వో వెంకటనారాయణమ్మ, పొల్యూషన్ కిషోర్ రెడ్డి, జియో మైసూరు కంపెనీ ప్రతినిధి రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

కళలను ఆదరించాలి

- మిమిక్రీ కళాకారుడు ఖాదర్‌బాబు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మిమిక్రీ కళాకారుడు ఖాదర్ బాబు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కళలను ప్రోత్సహిస్తూ, కళాకారులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని రిటైర్డ్ ఉద్యోగి, మిమిక్రీ కళాకారుడు పి.ఖాదర్‌బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో విలేకరుల సమావేశంలో బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27న ఆదివారం కళా ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీశైలం డ్యామ్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పదవీ విరమణ చేసిన తాను నలభై ఏళ్లుగా సాంస్కృతిక, కళా రంగాల్లో రాణిస్తున్నట్లు తెలిపారు. నాటక రంగంలో, యూట్యూబ్ చరిత్రలో సరికొత్త ప్రయోగంతో శ్రీకృష్ణ రాయబారం నాటకం నుంచి శయన ఘట్టంలోని శ్రీకృష్ణ, అర్జున, ధుర్యోదన పాత్రల్లో త్రిపాత్రాభినయం చేసి, దర్శకత్వం వహించి రూపొందించిన టెలీ ఫిల్మ్, సీనియర్ సినీ నటుల గెటప్‌లతో షార్ట్ ఫిల్మ్ ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. అనంతరం అభినందన సభ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ పి. రంజిత్‌బాషా, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌లను ముఖ్యఅతిథులుగా ఆహ్వానించామని, విశిష్ట అతిథిగా కళారత్న, హంస అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య విచ్చేస్తారని తెలిపారు.

సూపర్ స్పెషాలిటీ పరీక్షలో

కేఎంసీ విద్యార్థుల సత్తా


- స్టేట్ ఫస్ట్, సెకండ్, థర్డ్ ర్యాంకులు కైవసం


మహేష్, కార్డియాలజీ స్టేట్ ఫస్ట్ ర్యాంకు


ఆదిత్య, నెఫ్రాలజీ స్టేట్ ఫస్ట్ ర్యాంకు


రంగవేణమ్మ, నెఫ్రాలజీ స్టేట్ ఫస్ట్ ర్యాంకు


హిమజ, యురాలజీ స్టేట్ సెకండ్ ర్యాంకు


కిషణ్ రెడ్డి, ప్లాస్టిక్ సర్జరీ స్టేట్ మూడో ర్యాంకు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సూపర్‌స్పెషాలిటీ ఫైనల్ ఇయర్ పరీక్షల్లో కర్నూలు మెడికల్ కాలేజీ వైద్యవిద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విజయవాడ సోమవారం విడుదల చేసిన ఫలితాల్లో కర్నూలు మెడికల్ కాలేజీ కార్డియాలజీ విభాగానికి చెందిన 2022-24 బ్యాచ్ వైద్యవిద్యార్థి డా. మహేష్ పునుగుపాటి 800 మార్కులకుగాను 567 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంకు, నెఫ్రాలజీ విభాగానికి చెందిన డా. ఆదిత్య, డా. రంగవేణమ్మ ఇద్దరు 800 మార్కులకు 602 మార్కులు ఇద్దరు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంకును సంయుక్తంగా సాధించారు. యురాలజీ విభాగంలో ఫైనల్ ఇంటర్ విద్యార్థిని డా.హిమజ 800 మార్కులకుగాను 619 మార్కులు సాధించి స్టేట్ సెకండ్ ర్యాంకు సాధించింది. ప్లాస్టిక్ సర్జరీ విభాగం నుంచి డా. కిషన్ రెడ్డి స్టేట్ థర్డ్ ర్యాంకు సాధించారు. సూపర్ స్పెషాలిటీ విభాగంలో కార్డియాలజీ, నెఫ్రాలజీ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, యురాలజీ ప్లాస్టిక్ సర్జరీ విభాగాల్లో మొత్తం 9మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. అందరు మంచి మార్కులతో ఉత్తీర్ణత పొందారని ప్రిన్సిపాల్ డా.కే. చిట్టినరసమ్మ తెలిపారు.

గొడవలకు దూరంగా ఉండండి

- కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

వెల్దుర్తి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గొడవలకు దూరంగా ఉండాలని బొమ్మిరెడ్డి గ్రామ ప్రజలకు కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. సోమవారం బొమ్మిరెడ్డి పల్లెలో పర్యటించి, గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించారు. అన్యాయం జరిగిందని చట్టాన్ని చేతులోకి తీసుకోవద్దని, నేరం చేసినవారికి చట్ట ప్రకారం శిక్షలు ఉంటాయని అన్నారు. సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావలని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పిల్లలతో మాట్లాడుతూ బాగా చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. సీఐలు తేజమూర్తి, మదుసూదన్‌రావు, రామయ్య నాయుడు, విజయలక్ష్మీ, ఎస్‌ఐలు ఖాజావలి అశోక్, మల్లికార్జున ఉన్నారు.

వైసీపీ నాయకుల జోలికొస్తే సహించం

జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే విరూపాక్షి



కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న వైసీపీ నాయకులు

ఆలూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల జోలికి వస్తే సహించే ప్రసక్తే లేదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే విరుపాక్షి కూటమి నాయకులను హెచ్చరించారు. సోమవారం ఆలూరు మండలంలోని అరికెరలో రెండు నెలల క్రితం హత్యకు గురైన ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న కుటుంబానికి మాజీ సీఎం వైఎస్ జగన్ పంపిన రూ.5లక్షల చెక్కును నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే విరూపాక్షి మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగానికి రాజీనామా చేయలేదన్న కారణంతోనే కూటమి నాయకులు ఈరన్నను హత్య చేశారన్నారు. ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ ముందుకొచ్చారన్నారు. ఈరన్న భార్యకు అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలి ఉద్యోగం ఇప్పిస్తానని ఎంపీ బస్తిపాటి నాగరాజు ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కురువ శశికళ, నాయకులు తెర్నకల్ సురేంద్ర రెడ్డి జడ్పీటీసీ సభ్యులు దొరబాబు, రామకృష్ణ, మండల కన్వీనర్ మారయ్య, షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని కబళించిన రోడ్డు

- పెళ్లి పత్రికలు పంచి వెళ్తుండగా ప్రమాదం
- మరో ఎనిమిది రోజుల్లో యువకుడి పెళ్లి



నాగేంద్ర (ఫైల్)

పాములపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మరో ఎనిమిది రోజుల్లో యువకుడి పెండ్లి.. బంధువులను ఆహ్వానించడానికి ఎంతో ఉత్సాహంగా వెళ్లాడు. బంధువులకు పెళ్లి పత్రిక అందజేసి వివాహానికి రావాలని ఆహ్వానించాడు. అనంతరం సొంతూరుకు బయలుదేరాడు. అయితే ఇంతలోనే విధి వక్రీకరించింది. ఆ యువకుడిని రోడ్డు బలితీసుకుంది. దీంతో ఒక్కసారిగా ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలివీ.. ఆత్మకూరులోని వాల్మీకి నగర్‌కు చెందిన కాంతరావు, నాగసుబ్బమ్మ దంపతుల చిన్న కుమారుడు నాగేంద్ర(24) ఈ నెల 30న వివాహం నిశ్చయమయింది. బంధువులకు పెళ్లి పత్రికలు ఇచ్చి తిరుగు పయనమయ్యాడు. అయితే మార్గమధ్యంలో కంబాలపల్లి గ్రామ శివార్లలోని కేజీ రోడ్డుపై బైకు, ఓ ఫోర్ వీలర్ ఢీకొన్నాయి. బైక్‌పై వెళ్తున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. యువకుడి తల్లి పని నిమిత్తం పాములపాడు వచ్చి ఆటోలో తిరిగి వెళ్తున్న సమయంలో రోడ్డుపై పడి ఉన్న యువకుడి మృతదేహాన్ని చూసింది. తన కుమారుడి షర్టు లాగా ఉందని గమనించింది. అక్కడ చనిపోయింది తన కుమారుడే అని నిర్ధారించుకున్న ఆ తల్లి ఒక్కసారికి ఆటో నుంచి దూకి మృతదేహం వద్దకు పరుగెత్తింది. ఆమె రోదిస్తున్న తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. పోలీసులు మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పిడుగుపాటుకు యువకుడు..

నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మండలంలోని కొణిదేల గ్రామంలో ఆదివారం రాత్రి పిడుగుపాటుకు గురై గ్రామానికి చెందిన వడ్డె లక్ష్మీనరసింహ(28) మృతిచెందాడు.. గ్రామానికి చెందిన నరసింహ, శేషమ్మ దంపతుల కుమారుడు లక్ష్మీనరసింహ ఆదివారం పొలానికి వెళ్లాడు. రాత్రయినా ఇంటి రాకపోవడం, అలాగే ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లారు. అయితే పొలం గట్టుపై విగతజీవిగా పడి ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి గ్రామానికి వెళ్లి లక్ష్మీనరసింహ మృతికి సంతాపం తెలిపారు. అతడి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

తల్లి, భార్య దాడిలో వ్యక్తి..



సుధాకర్ (ఫైల్)

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై తల్లి, భార్యను వేధిస్తుండటంతో ఆదివారం రాత్రి సుధాకర్(34) అతడి తల్లి గోవిందమ్మ, భార్య సుమిత్ర కలిసి కట్టెలతో దాడి చేశారు. దీతో ఆ వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రతిరోజు హింసించడంతోపాటు ఆదివారం కూడా హింసించడంతో భయ పెట్టాలనే ఉద్దేశంతో ఇరువురు కలిసి కట్టెలతోదాడి చేశారు. అయితే ఆ దెబ్బలకు తాళలేక మృతి చెందాడు. ఘటన స్థలాన్ని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం సోమవారం ఉదయం పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోక్సో కేసు నమోదు.. రిమాండ్

డోన్ టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ బాలికపై లైంగిక దాడి చేసిన పిండిమిషన్ ఓనర్‌పై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అర్బన్ సీఐ ఇంతియాజ్ బాషా సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిండి మిషన్‌కు వెళ్లిన బాలికపై లైంగికదాడి చేయడం చుట్టుపక్కల వారు గమనించి బాలిక తల్లిదండ్రులకు తెలియజేశారు. బాలిక తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఇంతియాజ్ బాషా తెలిపారు.

ట్రాక్టర్ చోరీ ఘటనపై కేసు నమోదు ..

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిశెట్టిపల్లె గ్రామ సమీపంలోని సాయిరాం రైస్ మిల్లు వద్ద ఈనెల 15న రాత్రి జరిగిన ట్రాక్టర్ చోరీ ఘటనపై సోమవారం కేసు నమోదు చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు తెలిపారు. ఏపీ39ఎన్‌జె 9370 ట్రాక్టర్ రైస్‌మిల్ వద్ద పార్క్ చేసివుండగా ఎత్తుకెళ్లినట్లు బాధితుడు దూదేకుల చిన్నబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

రవాణా శాఖ అవినీతిమయం





నంద్యాల రవాణా శాఖ కార్యాలయం

- ప్రతి పనికి రూ.300 వసూలు?
- అధిక లోడ్ లారీలకు నెలకు రూ.12వేలు డిమాండ్
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- మధ్యవర్తుల ద్వారా వసూళ్లు
- వాహనదారుల ఇబ్బందులు

నంద్యాల టౌన్ ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలనకు పారదర్శకతను మించిన గీటురాయి ఉండదు. అది లోపిస్తే అవినితి ఊబిలో యంత్రాంగం కూరుకు పోయినట్లే. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి తారాస్థాయికి చేరుకుందనే విమర్శ తీవ్రస్థాయిలో వినిపిస్తోంది. మేం ఇంతే.. అన్న రీతిలో అధికారులు ప్రజల నుంచి వసూళ్లు చేస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే అధికారులు, మధ్యవర్తులు (ఏజెంట్లు) కార్యాలయం చుట్టూ పనుల కోసం తిప్పుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా నంద్యాల జిల్లా రవాణా కార్యాలయం అవినీతికి చిరునామాగా మారిందని అంటున్నారు. ఈ స్థితిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం...

నంద్యాల జిల్లా రవాణా కార్యాలయంలో ఎన్నిసార్లు ఏసీబీ దాడులు జరిగినా వారిలో మార్పు రావడం లేదు. వాహన దారులను ఇబ్బందులకు గురి చూస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. అటెండర్ నుంచి ఉన్నతాధికారుల వరకు అవినీతికి పాల్పడుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మొత్తం కంటే అధికారుల ఆదాయమే ఎక్కువగా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

జిల్లా రవాణా కార్యాలయంలో ఇలా...

జిల్లాలో నంద్యాల డీటీవో కార్యాలయం, డోన్ ఎంవీఐ, ఆత్మకూరు ఎంవీఐ కార్యాలయాలు ఉన్నాయి. జిల్లాలో లారీలు సుమారుగా వెయ్యి నుంచి 1,200 లారీలు ఉన్నాయి. వీటిలో నేషనల్ పర్మిట్ పొందాల్సినవి సుమారుగా 400 ఉంటాయి. వీటిలో ట్యాక్స్ కట్టని వాటికి నంద్యాల ఆర్టీవో కార్యాలయంలో ఒక్కో లారీకి రూ.16,500 వాహనదారుడు కట్టాలి కానీ, నంద్యాల ఆర్టీవో గత ఏడాది నుంచి వాహనం తిరగ లేదని వాహనదారుడి నుంచి రూ.5300 చొప్పన తీసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

నంద్యాలకు లారీలు హెవీ లోడుతో వస్తుంటాయి. ముందుగానే మధ్యవర్తులు వెళ్లి నెలకు రూ.12000 చెల్లిస్తే నీ వాహనం నంద్యాల జిల్లా పరిధిలో ఎక్కడా పట్టుబడకుండా చూస్తామని ఒక టోకన్ నెంబర్ ఇస్తారు. నంద్యాల ఎక్కువగా తంబరాజు పల్లె నుంచి గ్రావెల్, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, తాడిపత్రి నుంచి ఇసుక లారీలు, జేఎస్ డబ్ల్యూ నుంచి వచ్చే సిమెంట్ లారీలు ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల బనగానపల్లె, డోన్ నుంచి వచ్చే లారీలు నంద్యాల ఆర్టీవో కార్యాలయానికి నెలకు రూ.12000 ముట్టజెప్పాలి లేని పక్షంలో లారీ యజమాన్ని ముప్ప తిప్పలు పెడతారు.

నంద్యాల రవాణా కార్యాలయంలో రోజుకు లావాదేవీలు 300 దాకా వరకు జరుగుతున్నాయి. వీటికి ప్రతి వ్యవహారానికి రూ.300 వసూలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో రవాణా కార్యకాలాపాలన్నీ వేరే పోర్టల్ ద్వారా జరిగేవి. కూటమి ప్రభుత్వం వాహన యాప్ ద్వారా చేయాలని సూచించింది. అయితే వాహనదారులు వాటిని మార్చడానికి మండలం, ఈవేవైసీ, ట్రాన్స్‌ఫర్ అఫ్ ఓనర్ ఇలా జరిగి ప్రతి వ్యవహారానికి అన్ని పత్రాలు ఉన్నా రూ.300 చెల్లించాలి. ఏజెంటు ద్వారా కలెక్ట్ చేసి అధికారులకు పర్సెంటేజీ ప్రకారం పంచుతారు. ఇలా లంచాలు రోజుకు సుమారుగా రూ.1.5 లక్షల్లో వసూలు చేసుకుని పంచుకుంటున్నారు.

రవాణా కార్యాలయంలో జరిగినవి..

- నంద్యాల జిల్లా రవాణా కార్యాలయంలో ఇప్పటికి పలుమార్లు ఏసీబీ అధికారులు దాడులు చేసినా వారిలో ఎటువంటి మార్పులు రాలేదు. గతంలో కొన్నేళ్ల కిందట ఒక ఎంవీఐ వాహనదారుడి నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కి జైలుకు వెళ్లాడు.
- గతేడాది ఇక్కడే పని చేసి మరో ఏంవీఐ కర్నూలు రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పని చేస్తూ అక్రమ రవాణ, లంచం తీసుకున్న కేసులో ఏసీబీకి చిక్కి జైలు పాలయ్యాడు.
- గతేడాది నంద్యాల ఆర్టీవో కార్యాలయంలో పని చేస్తున్న ఏవో అక్రమ ఆస్తుల కేసులో ఏసీబీకి చిక్కి జైలుకు వెళ్లారు. అయినప్పటికీ వీరిలో మార్పు రావడం లేదు. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.
- గతంలో ఇక్కడ పని చేసిన క్లర్క్ రూ.2,500లు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ఆయన ప్రస్తుతం ఆదే కార్యాలయంలో పని చేస్తుండడం గమనార్హం.



రవాణా అధికారులు సీజ్ చేసిన వాహనాలు

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

నంద్యాల డీటీసీ కార్యాలయ పరిధిలో వాహనదారులు ప్రభుత్వం నిర్దేశించిన దానికంటే ఎక్కువగా చెల్లించాల్సిన అవసరం లేదు. అధికారులు ఎవరైనా అలా అడిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. వాహనదారుకుల కూడా పరిమితి మించిన లోడుతో వెళ్లరాదు. **- కృష్ణవేణి, జాయింట్ టాన్స్‌పోర్ట్ కమిషనర్**

కిరాణ దుకాణం దగ్ధం

ఆదోని రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దతుంబళంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. హోల్‌సేల్, రిటైల్ కిరాణ దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి దుకాణం మొత్తం కాలిపోయింది. వివరాలివీ.. హజ్రత్ ఫారూక్ కిరాణ దుకాణాన్ని జాండే ఫారూక్ నడుపుతున్నారు. ఆదివారం రాత్రి 10గంటలకు దుకాణం బంద్ చేసి యజమాని ఇంటికెళ్లిపోయారు. కొద్దిసేపటికే దుకాణం లోనుంచి పొగలు రావడంతో స్థానికులు యజమానికి ఫోన్ చేశారు. అంతలోపే దుకాణంలో మంటలు దవానంలా వ్యాపించి పెద్ద ఎత్తున చెలరేగాయి. రాత్రి 11గంటల సమయంలో అగ్నిమాపక అధికారులు అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. దుకాణంలో మంచినూనె డబ్బాలు ఉండడంతోనే మంటలు భారీ ఎత్తున చెలరేగాయని, బియ్యం బస్తాలు ఇతర సామాగ్రీ మొత్తం ఖాళీ బూడిదైందని, దాదాపు రూ.30లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ బాబు తెలిపారు.



పెద్దతుంబళంలో కాలి బూడిదైన సామగ్రి



ఆలూరులో దగ్ధమైన గడ్డివామి

గడ్డివామి..

ఆలూరు రూరల్: చెరుపుకట్ట ఆవరణలో ఉన్న కోట వీధికి చెందిన రైతు వీరేష్‌కు చెందిన గడ్డివాము సోమవారం దగ్ధమైంది. గడ్డివామి చుట్టూ మంటలు చెలరేగడంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. సర్పంచ్ అరుణాదేవి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బెంగళూరు కిషోర్ అగ్నిమాపక కేంద్రానికి మళ్లీ సమాచారం ఇచ్చారు. సిబ్బంది స్థలానికి చేరుకొని వాహనంలోని మోటార్ మరమ్మతుల కోసం ఇతర ప్రాంతానికి పంపామని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని చెప్పారు. అనంతరం ఆదోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా అప్పటికే గడ్డివామి పూర్తిగా కాలి బూడిద అయిందని తెలిపారు. 1.50 లక్షలు విలువ చేసే గడ్డివామి కాలిపోయిందని, ఆదుకోవాలని బాధితుడు కోరారు.

బస్సును ఆపి యువకుల హల్‌చల్

- మద్యం మత్తులో కండక్టర్, ప్యాసింజర్‌పై దాడికి యత్నం
- కేసు నమోదు చేసిన పోలీసులు

సంజామల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నొస్సం గ్రామంలో మద్యం మత్తులో బస్సును ఆపి యువకులు హల్‌చల్ చేసిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రొద్దుటూరు డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు కర్నూలు నుండి ప్రొద్దుటూరుకు వెళుతుండగా మార్గమధ్యంలో నొస్సం బస్‌స్టాప్ వద్ద గ్రామానికి చెందిన భరత్ అనే యువకుడు మద్యం మత్తులో బస్సును ఆపి ప్యాసింజర్, కండక్టర్‌పై దాడికి యత్నించారు. గ్రామస్థులు కలిసి బస్సును పంపించారు. బస్సు గ్రామ సమీపంలోని రైల్వే వంతెన వద్దకు చేరుకోగానే భరత్, అల్లూరి రమేష్ బాబు ఇరువురు కలిసి రాడ్లు తీసుకొని గంటపాటు బస్సును నిలిపారు. సహనం కోల్పోయిన కండక్టర్ శాంత కుమారి సంజామల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు వచ్చి బస్సును గమ్యానికి చేర్చారు. నిందితుల కోసం గాలించగా రమేష్ బాబు సాయంత్రం దొరికాడు. అతడిని జీపులో ఎక్కించుకొని దేహశుద్ధి చేశారు. గాయాలకు గురైన రమేష్ బాబు కడప జిల్లా జమ్మలముడుగు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. సంజామల ఎస్.ఐ రమణయ్య ఆ ఇరువురిపై కేసు నమోదు చేశారు.

అహోబిలం గేట్ ఇన్‌చార్జిపై చర్య

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అహోబిలంలోని ఎల్‌పి గేట్ ఇన్‌చార్జిగా పని చేస్తున్న ఎస్ ప్రసాద్‌ను సోమవారం సస్పెండ్ చేస్తూ దేవస్థానం మేనేజర్ మాధవన్ తెలిపారు. దిగువ అహోబిలం గేటు ఇన్‌చార్జి ఉంటు విధులకు గైర్‌హాజర్ కావడంతో సంజాయిషీ అడిగామన్నారు.

దీంతో ప్రసాద్ సంజాయిషీ నోటీసును తీసుకోక పోవడంతో శ్రీమఠం శ్రీకార్యము ఉత్తర్వుల మేరకు సస్పెండ్ చేసి నట్లు వివరించారు.

పెద్దపులి దాడిలో ఆవు మృతి

- పాల కోసం లేగదూడ తాపత్రయం

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లకాల్వ గ్రామ శివార్లలోని ఓ పొలంలో ఉన్న ఆవుల మందపై సోమవారం తెల్లవారుజామున ఓ పెద్దపులి చేసిన దాడిలో ఓ ఆవు మృతి చెందింది. వివరాలివీ.. గ్రామ శివార్లలోని కలీముల్లాకు చెందిన పొలంలో రైతు శంకర్‌కు చెందిన ఆవుల మందను కట్టి వేసి వెళ్లారు. అయితే సోమవారం తెల్లవారు ఝామున అకస్మాత్తుగా ఆ ఆవుల మందపై పెద్దపులి దాడి చేసి ఓ ఆవును తీవ్రంగా గాయ పరిచింది.

ఆవుల అలికిడికి అక్కడే ఉన్న పశువుల కాపరులు అప్రమత్తమై కేకలు వేయడంతో ఆ పెద్దపులి అడవిలోకి పారి పోయింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆవు అక్కడిక్కడే మృతి చెందిందని గ్రామస్థులు తెలిపారు. ఇదిలా ఉంటే ఉదయం తల్లి పాలకోసం ఆ ఆవుకు చెందిన లేగదూడ పడుతున్న పాట్లు గ్రామస్థులను కలచి వేసింది. అటవీ అధికారులు వివరాలు సేకరించారు.



తల్లి వద్ద పాలకోసం లేగదూడ ఎదురుచూపులు

ముంచిన గాలివాన

- నేలకొరిగిన మునగ చెట్లు
- రాలిపోయిన మామిడికాయలు
- ఆందోళనలో అన్నదాతలు



తరిగోపుల గ్రామంలో కూలిన మునగచెట్లు



రాలిన మామిడికాయలను చూపుతున్న రైతులు

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల నుంచి గాలివాన బీభత్సానికి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తరిగోపుల గ్రామానికి చెందిన గుండిచంద్రుడు అనే రైతుకు చెందిన 1.25 ఎకరాల్లో సాగుచేసిన మునగచెట్లన్నీ నెలకొరిగాయి. రూ.1లక్ష వరకు పెట్టుబడి పెట్టిన చేతికొచ్చే సమయంలో పడిపోయాయని, ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవిస్తున్నారు. అదే గ్రామంలో మంగన్న అనే రైతుకు చెందిన నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మామిటితోటలో గాలివానకు మామిడికాయలు రాలిపోయాయని, రూ.1.50 లక్షల నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

తంగడంచ గ్రామంలో ఆరబెట్టిన మొక్కజొన్నగింజలు వానకు తడిసినట్లు రైతులు తెలిపారు. ఆదివారం సాయంత్రం గాలివానకు చెట్లుపడటంతో విద్యుత్ సరఫరాకు రెండు గంటల పాటు తీవ్ర అంతరాయం కలిగింది. మండలంలో మొత్తం 44.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

ప్రతి సమస్య పరిష్కరిస్తాం: కమిషనర్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వస్తున్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 17 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులు మళ్లీ రెండు వారాల తరువాత వస్తున్నాయన్నారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే దానిని పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్ఓ జునైద్, ఎంఈలు సత్యనారాయణ, శేషసాయి టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

అర్జీలకు పరిష్కారం చూపాలి

గూడూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సమస్యలపై ప్రజల నుంచి వచ్చే అర్జీలను పరిశీలించి తక్షణ పరిష్కారం చూపాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. సోమవారం గూడూరులోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి తహసీల్దార్ అర్జీలను స్వీకరించారు.

సి.బెళగల్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రామయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ శ్రీనివాసులు, ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు, ఏపీఎం వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

అశోక్ కుటుంబానికి అండగా ఉంటాం



నివాళులర్పిస్తున్న గౌరు జనార్దన్ రెడ్డి

ఓర్వకల్లు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కురువ అశోక్‌బాబు కుటుంబానికి అండగా ఉంటామని టీడీపీ యువ నాయకుడు గౌరు జనార్దన్ రెడ్డి అన్నారు. సోమవారం ఓర్వకల్లు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కురువ అశోక్‌బాబు గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న గౌరు జనార్దన్ రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు రాంభూపాల్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, భాస్కర్ రెడ్డి, అన్వర్‌బాషా, అబ్దుల్లా, అల్లాబాబు, నాగరాజు, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా జాబ్ అచీవర్స్ డే

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): స్థానిక తాండ్రపాడులోని ప్రభుత్వ మైనార్టీ పాలిటెక్నికల్ కళాశాలలో సోమవారం జాబ్ అచీవర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఆటో మొబైల్స్, కంప్యూటర్, మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు ఉద్యోగాలు సాధించడంపై ప్రిన్సిపాల్ చక్రవర్తి ఆధ్వర్యంలో వేడుకలు జరుపుకున్నారు. ఆటో మొబైల్ ఇంజనీరింగ్ విభాగం నుంచి 17 మంది, కంప్యూటర్ ఇంజనీరింగ్ నుంచి 30 మంది, మెకానికల్ ఇంజనీరింగ్ నుంచి 35 మంది విద్యార్థులు రాయల్ ఎన్‌ఫీల్డ్ (చెన్నై) ఉద్యోగాలు పొందినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమానికి జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సబీహా పర్వీన్ హాజరై ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అన్ని విభాగాల విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

'ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకిద్దాం'

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకించాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు అన్నారు. సోమవారం సుర్జీత్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే డే స్ఫూర్తితో కార్మిక చట్టాలను కాపాడుకోవాలన్నారు. ఏపీలో రాష్ట్ర పభుత్వం పి ఫోర్ పేరుతో ప్రైవేటీకరణ ప్రోత్సహిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు రాజశేఖర్, అబ్దుల్‌దేశా య్, మైమూద్, ఖాజా, నాగస్వాములు పాల్గొన్నారు.

● బీజేపీ కబంధ హస్తాల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకుందామని ఆవాజ్ కమిటీ నగర కార్యదర్శి ఎస్ఎండీ షరీఫ్ పిలుపునిచ్చారు. రెండో వార్డు అలీషేర్‌బాగ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చిన అనంతరం ముస్లింలకు వ్యతిరేకంగా 12 రకాల జీఓలను తీసుకువచ్చిందన్నారు. ప్రస్తుతం వక్ఫ్ చట్ట సవరణతో ముస్లింలకు సంబంధించిన మసీదు, దర్గాల మాన్యాలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు ఇనాయతుల్లా ఖాన్, జమాతే ఇస్లాం ఏ హింద్ నాయకులు పీఎస్.మనీర్ అహ్మద్, గౌస్‌బాషా, రియాజ్ పాల్గొన్నారు.

గోకులం షెడ్డు నిర్మాణాలను వేగవంతం చేయాలి

సి.బెళగల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్డు నిర్మాణా లను వేగవంతం చేయాలని ఎంపీడీవో రాణెమ్మ ఏఈలను ఆదేశించారు. మండలంలోని పోలకల్లు, ముడుమాల, సిబెళగల్ గ్రామా ల్లో నిర్మిస్తున్న గోకుల షెడ్డు నిర్మాణాలను ఎంపీడీవో రాణెమ్మ, పంచాయతీరాజ్ ఏఈ వెంకట్ ప్రకాశ్ పరిశీలించారు. ఈసందర్భం గా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో జాబుకార్డు ఉన్నవారంతా ఉపాధి పనులను వినియోగించుకోవాలన్నారు. ఎంపీడీవో వెంట ఏపీవో రామన్న, ఈసీ రంగస్వామి ఉన్నారు.

వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు తగ్గించాలి

ఏపీ రైతు సంఘం



నిరసన తెలుపుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అమెరికా దేశం భారత వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు తగ్గించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఏఐకేఎస్ అద్వర్యంలో నగరంలోని సుందరయ్య కూడలిలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వ్యాన్స్ భారత రాక సందర్భంగా జేడీ వ్యాన్స్ గో బ్యాక్ అంటూ నిరసనలు తెలిపారు. భారత్ అమ్మకానికి లేదని..ట్రంప్, మోదీ విధానాలు నశించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ అమెరికాతో అన్ని అసమాన స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు చర్చల నుంచి వైదొల గాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జేడీ వ్యాన్స్ భారత దేశ పర్యటన బహుళ జాతి కంపెనీలకు భారీ లాభాలు చేకూర్చేందుకేనని అన్నారు. జిల్లా కార్యదర్శి జి.రామక్రిష్ణ, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు, కార్మిక నాయకులు రాముడు, నరసింహులు పాల్గొన్నారు.

అధికారులు పద్ధతి మార్చుకోవాలి: కాటసాని

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ అధికారులు పద్ధతి మార్చుకోవాలని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ రవీంద్రబాబును కలిశారు. ఈ మేరకు నియోజకవర్గంలో పలు రకాల అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, వాటిని వెంటనే ప్రారంభించాన్నారు. కూటమి నాయకులు వచ్చి చెబితేనే అధికారులు పనులు మంజూరు చేయడం సరికాదన్నారు. అధికారులే వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవాలన్నారు. ఏవైనా పనులు చేయాలని ప్రజలు వచ్చి అడిగితే స్థానిక ఎమ్మెల్యేల వద్దకి వెళ్లాలని అధికారులు సూచించడం మానుకోవాలన్నారు.

'దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం'

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లాలో బ్రాహ్మణుడిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అఖిల భారత బ్రాహ్మణ మహాసంఘం ఏపీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ దేవళ్ల వసంత సాయినాథ శర్మ సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. దేశంలో రోజూ ఎక్కడో ఒక చోట బ్రాహ్మణులపై దాడులు జరుగుతున్నాయన్నారు. బ్రాహ్మణులకు రక్షణ కల్పించాలని సుప్రీం కోర్టు, ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులకు విజ్ఞప్తి చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ దుశ్చర్యపై ఆయా జిల్లాల్లోని బ్రాహ్మణ సంఘాలు నిరసన కార్యక్రమాలు నిర్వహించి, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేయాలన్నారు.

రేపు ఆలయ భూములకు వేలం

ఓర్వకల్లు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులో వెలసిన చెన్నకేశవ ఆంజనేయస్వామి, శ్రీరామస్వామి నాగేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన భూములకు వేలం పాటలు ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు ఈవో చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. 2025-26 సంవత్సరానికి సంబంధించిన భూములకు చెన్నకేశవ స్వామి దేవస్థానం ప్రాంగణంలో వేలం పాటలు నిర్వహిస్తామన్నారు. పాటాదారులు రూ.2వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాల న్నారు. పాతబకాయిలు ఉన్నవారు వేలంలో పాల్గొనరాదన్నారు.

నేడు హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ హజ్ కమిటీ ఉత్తర్వుల మేరకు 2025 మే మాసంలో వెళ్తున్న హజ్ యాత్రికులకు మంగళవారం వ్యాక్సినేషన్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ది రాయలసీమ హజ్ సొసైటీ అధ్యక్షుడు ఎం. మహమ్మద్ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో కర్నూలు జిల్లా యాత్రికులకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం ఉంటుందని, కార్యక్రమానికి ఏపీ స్టేట్ మెంబర్ మన్సూర్ ఆలీఖాన్ హాజరవుతారని తెలిపారు. వ్యాక్సినేషన్ కార్యక్రమం 22న ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని, వివరాలకు సెల్ నెంబరు 9908545232 సంప్రదించాలన్నారు.

ప్రతి విద్యార్థికి ఉచిత కోచింగ్ ఇవ్వాలి

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ రాసే పేద విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత కోచింగ్ ఇవ్వాలని సోమవారం కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విద్యార్థి సంఘాల నాయకులు కలెక్టర్ రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, ఏఎస్‌పి అధ్యక్షుడు రాఘవేంద్ర, జైభీమ్ ఆర్మీ అధ్యక్షుడు విజయభాస్కర్‌లు మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షలు రాసే ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులకు ఉచితంగా కోచింగ్, వసతి సౌకర్యం కల్పించాలని కోరారు.

● 2023 సంవత్సరంలోని అర్బన్‌హెల్త్ సెంటర్స్‌లో స్టాఫ్ నర్సు ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేస్తే ఆప్లై చేసిన అభ్యర్థులు కొంత మంది నకిలీ సర్టిఫికెట్లు, సమర్పించి ఉద్యోగాలు పొందారని, వారిపై సమగ్ర విచారణ జరిపిం చాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాసులు, జిల్లా సహాయ కార్యదర్శి రాజీవ్ కలెక్టర్‌ను కోరారు.

● కర్నూలు నగరంలోని 39వ వార్డు మమతానగర్‌లో మురుగు కాలువ సరిగ్గా లేనందున రోడ్లపైకి మురుగునీరు ప్రవహిస్తుందని కాలనీవాసులు లక్ష్మి, సరళమ్మ, ఖాజాబి, సి.మునెమ్మ రాములు వాపోయారు. మురుగు కాలువకు మరమ్మతులు చేయాలని కోరారు.

వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింలకు మేలు: బీజేపీ



మాట్లాడుతున్న డాక్టర్ వినూషారెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుతో ముస్లింలకు మేలు జరుగుతుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వినూషా రెడ్డి అన్నారు. సోమవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కొంత మంది పెత్తందారుల చేతుల్లో వక్ఫ్‌బోర్డు ఆస్తులు దుర్వినియోగం అవుతున్నాయని అన్నారు. వక్ఫ్ భూములపై ఎవరు పర్యవేక్షణ చేస్తున్నారో తెలియడం లేదన్నారు. అదే తిరుమల తిరుపతి దేవస్థానంలో హుండీలో భక్తులు విరాళాలు వేస్తారని, వీటికి టీటీడీ ప్రభుత్వానికి, ప్రజలకు సమాధానం చెబుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీలోని ఆస్తులు పక్కదారి పట్టాయన్నారు. 1954 సంవత్సరంలో వక్ఫ్‌బోర్డు ఏర్పాటైందని, 31వేల లక్షల భూములు ఉన్నాయని లెక్కలో పేర్కొన్నారు. ఆ నిధులతో ఆసుపత్రులు కట్టించలేదని, పేద ముస్లిం మహిళలకు ఆర్థిక సాయం కానీ, పిల్లలకు విద్య చూపించలేదని తెలిపారు. కర్ణాటక, బెంగళూరులోని వక్ఫ్‌భూములు అన్యాక్రాంతమయ్యాని అన్నారు. రూ.500 కోట్లు విలువ చేసే ఆస్తులకు కేవలం రూ.50వేలు అద్దె చెల్లిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ముస్లింలను ఓటు బ్యాంకుగా వాడుకుంటుందని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బీఎస్ నాగరాజు, ముస్లిం మోర్చా మైనార్టీ నాయకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పూలే సినిమాను విడుదల చేయాలి



సమావేశంలో పాల్గొన్న బీసీ నాయకులు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పూలే సినిమాను వెంటనే విడుదల చేయాలని బీసీ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీకాంతయ్య డిమాండ్ చేశారు. సోమవారం బిర్లా కాంపౌండ్‌లో బీసీ ముఖ్య నాయకులు సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే సినిమా నిర్మిస్తే, కొంత మంది దుష్టశక్తులు సెన్సార్ బోర్డుకు వెళ్లి అడ్డుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. కొన్ని వందల ఏళ్ల కిందటే అంటరానితనం నిర్మూలనకు, సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటం జరిపిన మహనీయుడు పూలే అని కొనియాడారు. కార్యక్ర మంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవపూజ ధనుజంయ్ ఆచారి, అయ్యన్న యాదవ్, మధుసూదన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ధర్మేంద్ర

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా ఈపీ ధర్మేంద్రను నియమిస్తూ ఏపీ బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశవ శంకర్‌రావు సోమవారం విజయవాడలో నియామక ఉత్తర్వులు అందజేశారు. నూతన జిల్లా అధ్యక్షుడు ధర్మేంద్ర మాట్లాడుతూ నాపై నమ్మకంతో కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు కేశవ శంకర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ధర్మేంద్రను నియమించడంపై జిల్లాలో బీసీ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

16 మంది బైండోవర్

ఓర్వకల్లు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమితం తండా గ్రామానికి చెందిన 16 మందిపై నాటుసారా తయారీ చేస్తుండటంతో వారిపై సోమవారం బైండోవర్ నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ రెహానా సోమవారం తెలిపారు. తహసీల్దార్ విద్యాసా గర్ ముందు హాజరు పరిచి నాటుసారా తయారు చేయడం కానీ, విక్రయించడం చేయమని తహసీల్దార్ ముందు సారా విక్రేతలు ప్రమాణం చేశారు..

రేపు జిల్లా ఉషూ ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డీఎస్‌ఏ ఔట్‌డోర్ స్టేడియంలో బుధవారం జిల్లా స్థాయి ఉషూ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి టి.శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్స్ 18-40 సంవత్సరాల లోపు బాలబాలికలకు ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన జిల్లా ఉషూ క్రీడాకారులు మే నెల 5న విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొనాలని, వివరాలకు 9440047196 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలి



కేజీబీవీ పాఠశాల విద్యార్థినులను సన్మానించిన పుల్లయ్య

కల్లూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని రవీంద్రా విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య అన్నారు. 28వ వార్డు లక్ష్మీపురం కేజీబీవీ బాలికల పాఠశాలలో ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులను ఆయన సన్మానించారు. ప్రిన్సిపాల్ ఉమాదేవి అధ్వర్యంలో నిర్వహిం చిన కార్యక్రమానికి టీడీపీ నాయకుడు పుల్లారెడ్డి, ఆకెపోగు వెంకట స్వామి, కార్పొరేటర్ నారాయణరెడ్డి హాజరయ్యారు. ఇంటర్ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణతతోపాటు సైన్స్, ఇంజనీరింగ్ గ్రూపుల్లో 972, 970 మార్కులు సాధించిన విద్యార్థినులను ముఖ్య అతిథులు అభినందించారు. వారికి రూ.5వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజే శారు. కార్యక్రమంలో రామిరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ షేక్షావలి, విశ్వేశ్వ రయ్య పాల్గొన్నారు.

బ్యాంకు ఎదుట బాధితుల ధర్నా



ధర్నా చేస్తున్న బాధితులు

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పొదుపు రుణం సంబంధించి నెలసరి వాయిదాలు కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు ఓ బ్యాంకు ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడుమూరులోని బ్యాంకులో 2022లో బండగట్టు గ్రామానికి చెందిన గాంధీ దివ్యాంగుల పొదుపు గ్రూపు రూ.4లక్షలు రుణం పొందినట్లు తెలిపారు. తీసుకున్న రుణంపై ప్రతి నెల వాయిదాల మొత్తం రూ. 15,500 చొప్పున దాదాపు 22 కంతుల వరకు గ్రూపు లీడర్ చంద్రకు చెల్లిస్తూ వచ్చామన్నారు. అయితే గత మార్చిలో రుణం కంతులు చెల్లించాలని బ్యాంకు నుంచి ఫోన్ చేయడంతో మోసపోయినట్లు గుర్తించామన్నారు. ఇందుకు అప్పటి బ్యాంకు సిబ్బంది హస్తం ఉందని ఆరోపించారు. ఈ విష యమై పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు.

పండ్ల తోటల పెంపకంతో లాభాలు

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పండ్లు, పూల తోటల పెంపకంతో లాభాలు సాధించవచ్చని ఇంజనీరింగ్ కన్సల్టెంట్ ఉస్మాన్ బాషా అన్నారు. సోమవారం గోరంట్ల గ్రామంలో తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకంలో వందశాతం సబ్సిడీ కింద పండ్లు, పూలతోటలను సాగుచేసుకోవచ్చని అన్నారు. సన్న, చిన్నకారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఇటీవల మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం నిర్మించిన నీటితొట్టిని పరిశీలించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ పురుషోత్తం కుమార్ పాల్గొన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ జాబితా రూపొందించాలి

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఈ పంట నమోదు మేరకు ఇన్‌పుట్ సబ్సిడీ జాబితా రూపొందించాలని వ్యవసాయాధికారి రవిప్రకాష్ గౌడ్ ఆదేశించారు. సోమవారం ఆర్ఎస్కే సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ గత రబీలో ఏర్పడ్డ వర్షాభావం దృష్ట్యా ప్రభుత్వం కోడుమూరును కరువు మండలం కింద ఎంపిక చేసిందన్నారు. ప్రభుత్వం పప్పుశనగ, పొగాకు పంటలకు హెక్టారుకు రూ. 10 వేలు, కొర్ర, జొన్నలకు హెక్టారుకు రూ. 8500 ప్రకటించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో తస్లీమా పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఐఎన్‌టీయూసీ

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ కార్మికులకు అండగా ఉంటుందని జిల్లా అధ్యక్షుడు బి.బతుకన్న అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ సునీల్ విజయకుమార్‌ను నూతనంగా ఎనుకు న్నారు. ఆయనకు బ్రతుకన్న కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన తన అనుచర, సహచర 120 మంది కార్మికులను ఐఎన్‌టీయూసీలో చేర్పించారు. బ్రతుకన్న మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకపోయినప్పటికి ఐఎన్‌టీయూసీతోనే కార్మికులకు న్యాయం అని నమ్మి యూనియన్‌లో చేరడం శుభపరిణామన్నారు. అనంతరం సిటీ అధ్యక్షుడు రేపల్లె ప్రతాప్, కిషోర్ సునీల్ విజయకుమార్, మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షులు లాజర్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో సూరజ్ బాషా, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

గూడూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గూడూరులో రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గూడూరులో రీ సర్వేపై ఇప్పటికే అవగాహన ర్యాలీ నిర్వహించామన్నారు. రైతుల నుంచి వారి భూములకు సంబంధించిన పత్రాలను స్వీకరిస్తామన్నారు. .

సి.బెళగల్: మండలంలోని గ్రామాల్లో రీసర్వే పక్బందీగా నిర్వహించాలని మండల సర్వేయర్ నాగభూణం అన్నారు. సోమవారం గ్రామాల్లోని సర్వేయర్లతో ఆయన సమావేశమయ్యారు.

అత్యవసరానికి అవస్థలు

● సాముహిక మరుగుదొడ్లు

ఏర్పాటు చేయాలని డిమాండ్



గోవర్ధన్‌నగర్‌లో శిథిలావస్థకు చేరుకున్న మరుగుదొడ్డి

కల్లూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కల్లూరు అర్బన్ 32వ వార్డులో సమస్యలు వేధిస్తున్నాయి. నగర పరిధిలోని గోవర్ధన్‌నగర్, గంగావతీ నగర్‌లో దాదాపు 2,700 మంది ప్రజలు నివాసం ఉంటున్నారు. స్థానిక మహిళలు అత్యవసరానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఏర్పాటు చేసిన సామూహిక మరుగుదొడ్డి శిథిలావస్థకు చేరడంతో రెండు కాలనీల్లోని మహిళల కష్టాలు వర్ణణాతీతం. ఏళ్లతరబడి సమస్య వేధిస్తున్నా అధికారులు స్పందించడం లేదని స్థానిక మహిళలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ముళ్లపొదలతో నిండి..

32వ వార్డులోని సాముహిక మరుగుదొడ్డిని గోవర్ధన్‌నగర్, గంగావతీ నగర్ కాలనీల మహిళలు ఉపయోగిస్తున్నారు. మరుగుదొడ్డి ముళ్లపొదలతో నిండి ఉపయోగించుకోవడానికి కష్టంగా ఉందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి సౌకర్యం, మరుగుదొడ్డికి వెళ్లే రహదారి సరిగాలేక పిల్లలు, వృద్ధులు, మహిళలు కిందపడి గాయాలబారిన పడుతున్నామన్నారు. కాలనీలో మహిళల సమస్యలను కర్నూలు నగర పాలక సంస్థ అధికారులకు చాలాసార్లు ఫిర్యాదు చేసినా స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మరుగుదొడ్డి బాగు చేయాలి



గోవర్ధన్‌నగర్‌లోని మరుగుదొడ్డిని బాగుచేయాలి. రాత్రివేళల్లో బయటికి వెళ్లాలంటేనే మహిళలు హడలిపోతున్నారు. ముళ్లపొదలు పెరిగి లోపలికి వెళ్లడానికి కష్టతరంగా ఉంది.

- సంజమ్మ, స్థానికురాలు

సౌకర్యాలు కల్పించాలి



సాముహిక మరుగుదొడ్డిలో నీరు రహదారి వసతులు కల్పించాలి. ముసలివాళ్లు బయటికి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. కరెంట్ ఏర్పాటు చేసి సమీపంలోని ముళ్లపొదలు తొలగించాలి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించాలి.

- రంజాన్‌బీ, స్థానికురాలు

ప్రెస్ క్లబ్‌ను ఏర్పాటు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రెస్ క్లబ్‌ను ఏర్పాటు చేయాలని జర్నలిస్టు సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కర్నూలు జర్నలిస్టు సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక జిల్లాలో ప్రెస్ క్లబ్‌లు ఉండటంతో ప్రజా సమస్యల పరిష్కారానికి సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, భూపాల్, రమేష్, విశ్వనాథ్, శివ, వీరేష్, శివయ్య, సుధాకర్, మురళి, రాజు పాల్గొన్నారు.

జర్నలిస్టులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి: ప్రతి జర్నలిస్టు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సెట్కూరు సీఈవో కే.వేణుగోపాల్ సూచించారు. సోమవారం సమాచార శాఖ భవన్‌లోని రాయలసీమ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జర్నలిస్టులకు టోపీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హరికృష్ణ, విజయ్, చంద్రశేఖర్, రమేష్ పాల్గొన్నారు.

'వర్ధంతిని జయప్రదం చేయండి'

ఆస్పరి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తఈనెల 23న మండలంలోని పుప్పాలదొడ్డి గ్రామంలో నిర్వహించే సీపీఐ నాయకుడు బండమీద వెంకటేశ్వర్ల 41వ వర్ధంతిని జయప్రదం చేయాలని ఆ పార్టీ కార్యదర్శి విరుపాక్షి, పట్టణ కార్యదర్శి కృష్ణ మూర్తి పిలుపునిచ్చారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



లక్ష్మితండాలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మల్లికార్జున

తుగ్గలి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున సూచించారు. సోమవారం లక్ష్మీతండాలో సైబర్ నేరాలు, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళలను గౌరవించాలని, నేరాల నియంత్రణ కోసం గ్రామాల్లోని కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. జాతరలు, ఉత్సవాలను ప్రశాంతంగా చేసుకోవాలన్నారు. వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సారా అమ్మినా, తయారు చేసినా, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

ఆదోని, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ మిల్లు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం ధర్నా నిర్వహించి, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా హామీలను అమలు చేయకుండా ప్రజలను నమ్మించి మోసం చేసిందన్నారు. మణి, రాజు, వెంకప్ప, ప్రసాద్, అఖండ, మహదేవమ్మ పాల్గొన్నారు.

ముగిసిన ప్రవేశ పరీక్ష



హాజరైన విద్యార్థులు

ఆలూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్ష సోమవారం ముగిసింది. మొత్తం 300 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 27 మంది గైర్హాజరు అయినట్లు పరీక్షల చీఫ్ రాఘవరావ్, డిపార్ట్మెంటల్ అధికారి కరి బసప్ప తెలిపారు.

నైపుణ్య వికాసం అవసరం



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న హెచ్ఎం

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నైపుణ్య వికాసం అవసరమని పెద్ద హరివాణం జడ్పీహెచ్ పాఠశాల హెచ్ఎం ఇందిరా దేవి అన్నారు. సోమవారం పదో తరగతి వొకేషనల్ విద్యార్థులు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకోవడంతో వారికి సర్టిఫికెట్లను అందజేశారు. 12 రోజుల పాటు విద్యార్థులకు సచివాలయం, మీసేవ వ్యవస్థ, ఫోటోగ్రఫీపై శిక్షణ ఇచ్చారన్నారు.

వీఆర్‌వో మృతి

హాలహర్వి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హాలహర్వి వీఆర్‌వో సత్యనారాయణ మృతి పట్ల తాహసీల్దార్ నాజ్మాబాను, డీటీ లక్ష్మి, ఆర్ఐ మహేష్ గౌడ్ సంతాపం తెలిపారు. కుటుంబానికి రెవెన్యూ తరపున అండగా ఉంటామని తెలిపారు.

'త్వరలో కూలీలకు వేతనాలు'

హాలహర్వి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధి కూలీలకు త్వరలో వేతనాలు వారి ఖాతాలో జమ అవుతాయని ఎంపీడీవో వరలక్ష్మి తెలిపారు. సోమవారం మాట్లాడుతూ పెండింగ్ ఉన్న పల్లె పండుగ, గోకులం షెడ్లుకు సైతం బిల్లులు పెండింగ్ ఉన్నాయని ఒకేసారి జమఅవుతాయన్నారు. ప్రతి ఒక్కరు ఉపాధి పనులకు వెళ్లాని సూచించారు.

రుణం కోసం తిప్పలు

● ఇంటర్వ్యూలు పూర్తయినా జాబితా ప్రకటించని అధికారులు



దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు(ఫైల్)

మద్దికెర, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు రుణం మంజూరు కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ఇంటర్వ్యూలు పూర్తయినా రుణం అందకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. మండలంలో బీసీ, కాపు, కార్పొరేషన్ల కింద 50 యూనిట్లు మంజూరయ్యాయి.

నిరుద్యోగులకు ఉపాధే లక్ష్యం..

ఉద్యోగం, ఉపాధిలేని నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం 50 శాతం రాయితీతో రుణాలు ఇచ్చి వారు ఉపాధి పొందేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకు ఫిబ్రవరి 21వ తేదీన ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారు. అయితే ఇంతవరకు లబ్ధిదారుల పేర్లు ప్రచురించలేదు. మండలంలో 11 గ్రామాలు ఉన్నాయి. మద్దికెర కెనరా బ్యాంకు పరిధిలో 29 యూనిట్లు, పెరవలి గ్రామం ఏపీజీబీ బ్యాంకుకు 21 యూనిట్లు రుణాలు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకు 674 మంది దరఖాస్తు చేశారు. అయితే 50 మందికి మాత్రమే అవకాశం ఉంది. ఇప్పటికైనా స్పందించి, తమకు రుణం మంజూరు చేయించాలని కోరుతున్నారు.

నాయకుల చుట్టూ ప్రదక్షిణలు

తమకు రుణం ఇప్పించాలంటూ దరఖాస్తుదారులు రాజకీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే 674 మంది దరఖాస్తు చేసుకోగా, 50 మందికి మాత్రమే అవకాశం ఉండటంతో ఎవరికి ఇప్పించాలో తెలియక నాయకులు సతమతమవుతున్నారు.



రాజకీయ ప్రమేయం ఉండరాదు

ప్రభుత్వం ఇస్తున్న రుణాల విషయంలో రాజకీయ నాయకుల ప్రమేయం ఉండరాదు. లబ్ధిదారుల జాబిత ఆలస్యం చేయడం మంచిది కాదు. - సునీల్, దరఖాస్తుదారుడు

అర్హులకు ఇస్తాం

నిరుద్యోగులు రాయితీ రుణాల కోసం ఎదురు చూస్తున్నారు. అర్హుల కు తప్పకుండా రుణాలు అందజేస్తాం.

- కొండయ్య, ఎంపీడీవో, మద్దికెర.

ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించండి

● సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



వినతులను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరధ్వాజ్

ఆదోని, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని, పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయవద్దని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్‌లో సబ్ కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

మండలాల నుంచి వచ్చిన సమస్యలు కొన్ని..

1. మంత్రాలయం మండలం రాంపురం గ్రామానికి చెందిన బొగ్గుల రాజేశ్వరికి తనకు వితుంతు పించన్ మంజూరు చేయాలని ఆర్జీ సమర్పించుకున్నారు.

2. ఆదోని మండలం కుప్పగల్ గ్రామానికి చెందిన గోవర్దన్ తాను రేకులతో గుడిసెను నిర్మించుకున్నానని, విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉన్నాయని, సమస్యను పరిష్కరించాలని అర్జీ సమర్పించుకున్నారు.

3. హొళగుంద మండలం ముగుమాను గొంది గ్రామానికి చెందిన గాది లింగ తన సర్వేయర్ నెం. 124ఏ నందు 4.57 ఎకరాల భూమి ఉందని, రీ సర్వే అనంతరం 4.29 ఎకరాల భూమి చూపుతోందని, న్యాయం చేయాలని అర్జీ సమర్పించుకున్నారు.

4. హొళగుంద మండలం కోగిలతోట గ్రామానికి చెందిన కృష్ణాచారి తన సర్వే. నెం. 111/సీ లో 2.19 ఎకరాలు తనకు పెద్దల నుంచి సంక్రమించిదని, విచారణ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ సమర్పించుకున్నారు.

ఈ కార్యక్రమంలో సర్వేయర్స్ శ్రీనివాసరాజు, వేణు సూర్య, డీఎల్పీవో నూర్జహాన్, డిఎల్డివో రమణ రెడ్డి, షఫీఉల్లా, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, ఆర్టీసీ డిపోమేనేజర్ మహమ్మద్ రఫ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, డీటీలు గుండాల నాయక్, వలిభాష పాల్గొన్నారు.

'నీటి సమస్య తలెత్తకుండా చర్యలు'

దేవనకొండ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు ఆర్‌డ బ్ల్యూఎస్ ఏఈ మురళి మోహన్ అన్నారు. మండలంలోని గుడిమిరాళ్ల గ్రామంలో 3 నీటి గుమ్మిలను ఏర్పాటు చేశామని సురక్షిత తాగునీరు అందిస్తున్నా మన్నారు. అలాగే కప్పట్రాళ్ల బండగట్టు స్కీం పంపింగ్ లైన్ 200 వందలమీటర్ల నూతన పైపులైను, దేవనకొండ గ్రామ పంచాయతీ అవరణలో ఓవర్ హెడ్ ట్యాంకుకు మరమతులు చేయించామని తెలిపారు.



గుడిమిరాళ్లలో మినీ ట్యాంకు

తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి

ఆదోని టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రుల సలహా సంఘం సభ్యుడు నసీరుద్దీన్ పటేల్ కోరారు. సోమవారం మాట్లాడుతూ రాంజల, బసాపురం చెరువులను పూర్తి స్థాయిలో నీటితో నింపుకోని కారణంగా వేసవిలో శివారు ప్రాంతాలకు నీరు అందడం లేదన్నారు. మినీ ట్యాంకులను అందుబాటులోకి తేవాలని సూచించారు

విద్యార్థులకు సమగ్ర పత్రాలు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు సమగ్ర పత్రాలు(ప్రోగెస్ కార్డులు) పంపిణీ చేసినట్లు సోమవారం నెహ్రూ పాఠశాల హెచ్ఎం హలీం సిద్దికి తెలిపారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులతో సంతకాలు చేయించుకుని తిరిగి తీసుకురావాలని సూచించారు. విద్యా కమిటీ చైర్మన్ ఉరుకుంద పాఠశాల ఉపాధ్యాయులు సుధాకర్, అనిల్, ప్రసాద్, కోటి, లోక్యనాయక్, విజయ్ పాల్గొన్నారు.



ప్రోగ్రెస్ రిపోర్టు ఇస్తున్న హెచ్ఎం

పోస్టులను రద్దు చేయవద్దు

ఆలూరు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జూనియర్ కళాశాలల్లో పీడీ పోస్టులను రద్దు చేయవద్దని పీఈటీ కవి రాజ్, డివైఎఫ్ఐ కార్యదర్శి షైన గోవర్ధన్ డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పీడీ పోస్టులను రద్దు చేయడం వల్ల క్రీడల్లో ప్రతిభ గల విద్యార్థులు తీవ్రగా నష్టపోతారని చెప్పారు. పోస్టుల రద్దు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. అనంతరం ఆలూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. లక్ష్మి నారాయణ, బసవరాజు, సోమశేఖర్, మధు పాల్గొన్నారు.

ఆదోనిలోనే ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస ఆచారి

ఆదోని టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జూలైలో ప్రారంభమయ్యే అమర్నాథ్ యాత్రలో పాల్గొనే భక్తులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను ఆదోనిలోనే జారీ చేయాలని టీడీపీ మండిగిరి వార్డు ఇన్‌చార్జి శ్రీనివాస ఆచారి కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ భరద్వాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వం ఆసుపత్రికి వెళ్లాలంటే భక్తులకు ఇబ్బందికరంగా ఉంటుందని అన్నారు. స్పందించిన సబ్ కలెక్టర్ స్థానిక ఆసుపత్రి ఆధికారులకు ఆదేశాలు జారీ చేయడం పట్ల ధన్యవాదాలు తెలిపారు.

ఆదమరిస్తే అంతే?



కల్వర్ట్‌పై ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్

ఆదోని టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని నిజాముద్దీన్ కాలనీ వద్ద కల్వర్టుపై స్లాబు దెబ్బతింది. దీంతో ఏమాత్రం ఆదమరిచినా పాదచారులు, వాహనదారుఏలకు ప్రమాదం పొంది ఉంది. రాత్రిళ్లు ప్రమాదాలు సంభవిస్తున్నాయని కల్వర్టుకు స్లాబు వేయాలని వార్డు కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ మునిసిపల్ కమిషనర్, ఎంఈలను కోరారు.

నేలవాలిన అరటి

క్రిష్ణగిరి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోయిలకొండ గ్రామంలో గాలివానకు అరటితోట నేల వాలింది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు చంద్రశేఖర్ 3 ఎకరాలు కౌలుకు తీసుకొని అరటి సాగు చేసాడు. రూ.5లక్షలు పెట్టబడి పెట్టాడు. గెలలు కూడా బాగా రావడంతో మురిసిపోయాడు. అయితే ఆది వారం గాలివాన రావడంతో మొక్కలు వాలి పోయాయి. రూ.10లక్షల మేరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు చంద్రశేఖర్ కోరారు.



నేలవాలిన అరటిని చూపుతున్న రైతు

రీ సర్వే సమస్యలను పరిష్కరిస్తాం



రైతుతో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాదురాజు

దేవనకొండ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గతంలో చేసిన రీ సర్వే తప్పులను పరిష్కరిస్తామని తహసీల్దార్ ప్రసాదురాజు అన్నారు. మండలంలోని పోట్లపాడు రెవెన్యూలో మంగళి జయలక్ష్మి తనకు సర్వే నెం.95/3లో 3 సెంట్లు తక్కువగా ఉందని, గతంలో రీసర్వే గ్రామ సభలో ఫిర్యాదు చేశారు. సీసీఎల్ఏ అమరావతి అధికారులు కర్నూలు కలెక్టర్‌కు పంపగా, కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సర్వే చేసి, 3 సెంట్ల భూమి పక్కన పొలంలోకి వెళ్లిందని గుర్తించి, న్యాయం చేశారు. సర్వేయర్ షఫివుల్లా, వీఆర్వో హనుమన్న ఉన్నారు.

వేతనాలు చెల్లించండి

ఆదోని రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తమ వేతనాలను చెల్లించాలని ఉపాధి కూలీలు, వ్యవసాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లింగన్న డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించారు. సకాలంలో వేతనాలు చెల్లిస్తే కూలీలు వలసలు వెళ్లరన్నారు. 10 వారాలుగా కూలీలకు వేతనాలు ఇవ్వడంలేదని, తక్షణమే చెల్లించాలని, లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవో రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.



మాట్లాడుతున్న రైతులు, నాయకులు

ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం

మద్దికెర, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం, ఆరోగ్యం వస్తుందని తహసీల్దార్ హుశేన్ సాహెబ్ అన్నారు. సోమవారం ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల స్టాల్స్‌ను పరిశీలించారు. రైతులు రసాయన ఎరువల వాడకం తగ్గించి ఈ పద్ధతిలో సాగుచేస్తే పెట్టుబడి తగ్గి, ఆదాయాన్ని పొందవచ్చన్నారు. సర్పంచ్ విజయ్, సీపీఐ కార్యదర్శి నాగరాజు, కో ఆర్డినేటర్ భీమరాజు ఉన్నారు.



స్టాల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

విద్యా, వైజ్ఞానిక శిక్షణను జయప్రదం చేయాలి

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 25, 26, 27 తేదీల్లో నిర్వహించనున్న విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ బాషా కోరారు. సోమవారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో విద్య వైద్యానికి మహాసభల గోడపత్రికలను విడుదల చేశారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77ను రద్దు చేయాలన్నారు. దస్తగిరి, శేఖర్, వినయ్, ప్రభాకర్ రెడ్డి, ఆచారి గంగాదర్, తిరుమల రమేష్, వీరేష్, భీమేష్ పాల్గొన్నారు.

విచారణ చేయాలి

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీలో అవతవకలపై విచారణ చేయాలని అసోసియేషన్ నాయకులు లింగప్ప డిమాండ్‌చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. మార్కులు ట్యాంపరింగ్ చేసి ఉద్యోగాలు పొందుతున్న వారిపై విచారణ చేసి, కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తప్పుడు కొవిడ్ 19సర్వీస్ సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగం పొందిన వాళ్ళని వెంటనే తొలగించాల న్నారు. ఆధారాలను సబ్ కలెక్టర్‌కు అందజేశామని తెలిపారు. బీరప్ప, శేఖర్, వినయ్ పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

తుగ్గలి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీతోనే బీసీలు అభివృద్ధి చెందుతారని జడ్పీ హెచ్ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మిద్దె రవికుమార్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణస్వామి యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని జొన్నగిరిలో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే శ్యాంబాబు బీసీల ఎదుగుదలకు కృషి చేస్తున్నారన్నారు.

అండర్-19 క్రికెట్‌కు ఎంపిక



రసూల్, ముఖేష్ కుమార్, ఇలియాజ్ బాషా

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ముగ్గురు క్రీడాకారులు అండర్-19 జాతీయ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. ఎస్.రసూల్, ముఖేష్ కుమార్, ఇలియాజ్ బాషా గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో నిర్వహించిన టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచారు. దీంతో ఏపీ టెన్నిస్ క్రికెట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆర్‌డీ ప్రసాద్ "వీరిని ఎంపికచేశారు. క్రీడాకారులు మే 5, 6 తేదీల్లో నాగ్‌పూర్‌లో పాల్గొంటారు.

మే డేను జయప్రదం చేయండి

వెల్దుర్తి టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మే డేను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు బి.మాధవస్వామి కోరారు. సోమవారం కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. నాగమద్దయ్య, యేసయ్య, కే.రామంజనేయులు, కే.అనిల్, రాము, కృష్ణ, మధు, లద్దగిరి బొమ్మిరెడ్డి పాల్గొన్నారు.

పొగాకు కంపెనీపై చర్యలు తీసుకోవాలి

వెల్దుర్తి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పొగాకు కంపెనీపై చర్యలు తీసుకోవాలని సీపీఐ కార్యదర్శి కృష్ణ కోరారు. సోమవారం తహసీల్దార్ చంద్రశేఖరవర్మకు వినతి పత్రం సమర్పించారు. మండలంలో ఏజెంట్ల ద్వారా అలవెన్స్ కంపెనీ రైతులకు పొగాగు కొనుగోలు చేస్తామని పంట వేయించి, అనంతరం తీసుకోవడం లేదన్నారు.

సురేంద్ర మృతి తీరని లోటు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి



నివాళి అర్పిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి,



అంత్యక్రియల్లో పాడె మోస్తున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్

ఆలూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సురేంద్రనాయుడి మృతి పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్యాలకుర్తి తిక్కారెడ్డి, ఆలూరు ఇన్‌చార్జ్ వీరభద్ర గౌడ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠ శివప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గుమ్మనూర్ నారాయణ అన్నారు. గుండె పోటుతో మృతిచెందిన సురేంద్ర పార్థివ దేహానికి వారు సోమవారం నివాళి అర్పించారు. కుటుంబాన్ని ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి ఆర్థిక సాయం అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు మీనాక్షి నాయుడు, రామ్ భీం నాయుడు, టీడీపీ నాయకులు రామ్‌నాథ్ యాదవ్, ప్రసాద్ రెడ్డి, నారాయణ రెడ్డి, అశోక్, నరసప్ప, రాము, జగన్, ముద్దు రంగ, కొమ్ము రామాంజినేయులు, జనసేన నాయకులు రంజిత్, చత్రపతి పాల్గొన్నారు.



టీడీపీ అండగా ఉంటుంది

ఎక్స్‌లో పోస్ట్ చేసిన నారా లోకేష్

తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి సురేంద్ర మృతి కలచివేసిందని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీవో నరసమ్మ

మంత్రాలయం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, పౌష్టికాహారంతోనే ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని సీడీపీవో నరసమ్మ అన్నారు. సోమవారం మంత్రాలయం అంగన్‌వాడీ కేంద్రం-1లో సూపర్‌వైజర్ వీర గోవిందమ్మ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టిహారంపై అవగాహన కల్పించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, అంగన్‌వాడీ కేంద్రం ద్వారా ఇచ్చే పౌష్టికాహారం తీసుకోవడం వల్ల గర్భిణులకు సుఖ ప్రసవం, తల్లిబిడ్డలు క్షేమంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సీహెచ్‌వో జయంతి, అంగన్‌వాడీ టీచర్లు భీమేశ్వరి, స్వప్న, కళ్యాణి, ప్రమీలమ్మ, సునీత, శ్వేత పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

మంత్రాలయం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలం సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం ఎంపీపీ గిరిజమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాధ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం సమావేశంలో తాగునీరు, సాగునీరు, పరిశుభ్రత, పింఛన్లు, విద్యుత్, విద్య, ఆరోగ్యం, పొదుపు, ఉపాధి, వ్యవసాయం, వంటి అంశాలపై చర్చిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, నివేదికలతో హాజరు కావాలని తెలిపారు.

30న అక్షయ తృతీయకు ప్రత్యేక ఏర్పాట్లు

మంత్రాలయం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఈ నెల 30న జరిగే అక్షయ తృతీయకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్ జోషీ, సురేష్ కోనాపూర్ తెలిపారు. రాఘవేంద్రస్వామి బృందావనంతో పాటు పూర్వపు పీఠాధిపతుల బృందావనాలకు గంధ లేపనంతో అలంకరించేందుకు గంధాన్ని సిద్ధం చేస్తున్నారు. అక్షయ తృతీయ గంధ లేపనంలో పాల్గొనే భక్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

ఉరుకుందలో ప్రత్యేక పూజలు

కౌతాళం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు తెల్లవారుజామునే శుద్ధ జలంతో అభిషేకించి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. ఎల్‌ఎల్‌సీ కాలువలో పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకోగా, మరికొందరు స్వామివారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు అన్నదానం చేపట్టారు.

పెన్షనర్ల కార్యాలయంలో వైద్య శిబిరం

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెన్షనర్ల కార్యాలయంలో సోమవారం ఆర్బిట్ ల్యాబ్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఏపీ వీరన్న, కార్యదర్శి శ్రీనివాసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అధిక సంఖ్యలో పెన్షనర్లు హాజరై రక్త పరీక్షలను చేయించుకున్నారు. కొంతమందిని వైద్య పరీక్షలకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఆర్బిట్ సిబ్బంది రాజశేఖర్, కుమార్, జోసెఫ్, పెన్షనర్లు పాల్గొన్నారు.

గౌరవ వేతనం ఇప్పించాలి



ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న ఎంపీటీసీలు

గోనెగండ్ల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తమకు గౌరవ వేతనం ఇప్పించాలని ఎంపీటీసీ సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం మండల కార్యాలయంలో ఎంపీడీవో మణిమంజరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఎంపీటీసీలుగా ఎన్నికై నాలుగేళ్లు పూర్తి అవుతుందన్నారు. కేవలం ఒక్కఏడాది గౌవర వేతనం మాత్రమే విడుదల అయిందని, మిగతా మూడేళ్ల వేతనం అందలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మద్దయ్య, రజియాసుల్తానా, ముదీరమ్మ, బీరమ్మ, సుదాకర్, రఫూఫ్, పుష్పా, వెంకటరామిరెడ్డి ఉన్నారు.

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

చంద్రబాబు, లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఇచ్చిన మాటను టీడీపీ ప్రభుత్వం నిలబెట్టుకుందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయటంతో సోమవారం స్థానిక కుర్ణి కమ్యునిటి హాల్ దగ్గర నిరుద్యోగ ఉపాధ్యాయులతో కలిసి సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు ఎమ్మెల్యే బీవీ, నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ డీఎస్సీ పేరుతో నిరుద్యోగ ఉపాధ్యాయులను నిలువునా మోసం చేసిందన్నారు. తమ ప్రభుత్వం రాగానే ఇచ్చిన మాటప్రకారం 16వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు పూనుకుందన్నారు. కార్యక్రమంలో పార్టీ పరి శీలకులు జిల్లెల శ్రీరాములు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు నాగరాజు, టీడీపీ నాయకులు మహేంద్రబాబు, కురువ మల్లయ్య,భాస్కర్ చౌదరి,బుగిడే నాగరాజు, మహేష్, నవాజ్, కటారి రాజేంద్ర, వాహీద్‌లు పాల్గొన్నారు.

15.6 మి.మీ వర్షపాతం నమోదు

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలో 15.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆదివారం రాత్రి భారీ ఈదురు గాలులతో కూడిన వర్షపాతం నమోదైందన్నారు. మండలంలోని సిరాలదొడ్డి, కొటేకల్లు, దేవిబెట్ట తదితర గ్రామాల్లో ఉన్న అరటి తోటలు ఈదురు గాలులకు కొంతమేర దెబ్బతిన్నాయి.

తాగునీరు కలుషితం

• రోగాల బారిన పడుతున్న ప్రజలు
• మరమ్మతులకు నోచుకోని తాగునీటి పైపులైను

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తాగునీరు కలుషితమవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దాంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పట్టణంలోని లక్ష్మీపేటలోని మాచాని సోమప్ప స్కూల్ సమీపంలో తాగునీటి పైపు లైను లీకేజీ కావడంతో మున్సిపల్ అధికారులు మరమ్మతుల కోసం తవ్వారు. దాదాపు ఐదు నెలలు కావస్తున్న ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టకుండా వదిలేశారు. దీంతో ఆ పైపు లైన్ నుంచి నీరు వృథాగా పోవడమే కాక మురుగునీరు పైపుల్లో కలుస్తూ సరఫరా కావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తాగునీరు కూడా దుర్గంధం వెదజల్లుతోందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇలాగే కొనసాగితే కాలనీవాసులు రోగాల బారినపడే ప్రమాదము ఉందని వాపోతున్నారు. దానికి తోడు రోడ్డును సగం తవ్వి వదిలేయడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతు న్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



చెత్తతో నిండిపోయిన పైపులైన్ మరమ్మతు కోసం తవ్విన గుంత

ఐదునెలల క్రితం తవ్వారు



ఐదు నెలలు కింద పైపు లైన్ లీకేజీ కావడంతో మరమ్మతుల కోసం గుంత తవ్వి విడిచిపెట్టారు. ఇంతవరకు పట్టించుకునే నాథుడు లేడు. తాగునీరు లీకేజీ అవుతోంది. మురుగు నీరు కూడా పైపుల్లో కలుస్తోంది. నీరు కూడా దుర్వాసన వస్తోంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

- శేఖర్, స్థానికుడు

రోగాల బారిన పడుతున్నాం



తాగునీరు సప్లై చేసే పైపు లీకేజీ అవుతోంది. అధికారులకు అనేక సార్లు తెలియజేశాం. ఐదు నెలల క్రితం గుంత తవ్వి వదిలేశారు. పనులు కూడా సగం చేసి ఇటు వైపు చూడటం లేదు. మురుగునీరు పైపుల్లోకి వస్తోంది. రోగాల బారిన పడుతున్నాం. అధికారులు త్వరగా పైపు లైన్ మరమ్మతులు చేపట్టి గుంతను పూడిపించాలి.

- హనుమంతు, స్థానికుడు

అధికారుల పర్యవేక్షణ కరువు

మండల సమావేశంలో విద్యాశాఖతీరుపై మండిపడ్డ ఎంపీటీసీ

గోనెగండ్ల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల బోధన సక్రమంగా లేకపోవడం వల్లనే ప్రతి ఏడాది పదవ తరగతిలో ఉత్తీర్ణత శాతం తగ్గుతోందని, విద్యాశాఖ అధికారులు తగు శ్రద్ధ తీసుకోవడం లేదని గోనెగండ్ల ఎంపీటీసీ రజియాసుల్తానా ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీడీవో సమావేశ భవనంలో ఎంపీపీ నసూరుద్దీన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ రజియాసుల్తానా మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు పిల్లలను ఆకట్టుకునేందుకు ఇళ్లళ్ల తిరుగుతున్నారని, ప్రభుత్వ ఉపాధ్యాయులు మాత్రం తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఆమె వాదనకు సభ్యులందరు మద్దతు ప్రకటించారు. అలాగే ఎంఈవో రామాంజినేయులు మాట్లాడుతూ మండలంలో విద్యాబోధన సక్రమంగా జరుగుతుందని మండల వ్యాప్తంగా 10,696 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ఏవో హేమలత మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకీకరణలో భాగంగా రూ.10లక్షల విలువైన పనిముట్లు మంజూరయ్యాయని అన్నారు. 20శాతం సబ్సిడీతో డ్రోన్‌లను రైతులకు మంజూరు చేస్తామన్నారు. పీఆర్‌ఏఈ శివశంకర్ మాట్లాడుతూ పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా పల్లెలో సీసీ రోడ్డు, డ్రైనేజీలను పూర్తి చేశామని, 4, 5 విడతల్లో మరిన్ని పనులు చేస్తామన్నారు. స్త్రీశక్తి భవనానికి నిధులు కేటాయించాలని ఏపీఎం హేమలత కోరారు. ఇందుకు ఎంపీడీవో స్పందిస్తూ నిధులను విడుదల చేసేవిధంగా చూస్తామని హామీ ఇచ్చారు. సీఐ విజయభాస్కర్ మాట్లాడుతూ మండలంలో ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. పలు శాఖల అధికారులు తమ నివేదిక చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీడీవో మణిమంజరి, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంఈవోను నిలదీస్తున్న ఎంపీటీసీ రజియా సుల్తానా

టీడీపీ 22వ వార్డు అధ్యక్షుడిగా మహేంద్ర బాబు



22వ వార్డు నూతన కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 22వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా మహేంద్ర బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీడీపీ సంస్థాగత కమిటీల నియమాకం గత మూడు రోజులుగా స్థానిక కుర్ణి కమ్యునిటీ హాల్‌లో పార్టీ పరిశీలకులు జిల్లేల శ్రీరాములు సమక్షంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సోమవారం పట్టణంలోని 9,21, 22,23 వార్డు నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా 22వ వార్డు అధ్యక్షులుగా మహేంద్ర బాబును ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శిగా రంగస్వామి, తెలుగుమహిళా అధ్యక్షురాలుగా లక్ష్మి, 21వార్డు అధ్యక్షుడిగా మాచాని శివశంకర్, 23వ వార్డు అధ్యక్షుడిగా మహబూబ్‌బాషా, ప్రధానకార్యదర్శి బత్తిన సురేష్‌లను ఎన్నుకున్నారు. 9వవార్డు అధ్యక్షుడిగా ఇబ్రహీం, 10వ వార్డు రాజహ్మాద్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కొండయ్య చౌదరి, నాయకులు భాస్కర్ చౌదరి, మాదవ్, శ్రీకాంత్, సురేష్ చౌదరి, కటారి రాజేంద్ర, గుల్లా సలాం పాల్గొన్నారు.

ముగిసిన మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని కడివెళ్ల పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి జరిగిన పరీక్షలు సోమవారం ముగి శాయి. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన పరీక్షలు మధ్యాహ్నం 12గంటలకు ముగిశాయి. మొత్తం 189 మంది విద్యార్థులకు గాను 165 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 24 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర తెలిపారు.

పెద్దకడుబూరు: మండల కేంద్రమైన పెద్దకడుబూరులోని మోడల్ స్కూల్‌లో సోమవారం జరిగిన 6వ తరగతి ప్రవేశ పరీక్షలకు 271 మంది విద్యార్థులు గాను 265 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 6 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ రంగన్న తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని ఎంఈవో రామ్మూర్తి పరిశీలించారు.

రైతు ఆత్మహత్యపై విచారణ



వివరాలు సేకరిస్తున్న వ్యవసాయ అధికారి

మంత్రాలయం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రైతు ఆత్మహత్యపై వ్యవసాయాధికారి జీర గణేష్ విచారణ చేపట్టారు. మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన కురువ పెద్దయ్య అనే రైతు అప్పుల బాధతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం బాధిత ఇంటికి వెళ్లి సాగు చేసుకున్న పొలం, వేసుకున్న పంటలు, సాగుబడి, గిట్టుబాటు ధర అప్పులు, వంటి అంశాలపై విచారణ చేశారు. దాదాపు రూ.15 లక్షల దాకా పంటపై అప్పులు చేసినట్లు బాధిత కుటుంబం తెలిపింది. ప్రభుత్వం సహాయాన్ని అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు వివరాలను ప్రాథమిక నివేదిక ద్వారా ఉన్నతాధికారులకు అందజేస్తామని ఏవో తెలిపారు.

టీడీపీ నాయకురాలికి నివాళి



నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకుడు దేశాయి మాధవరావు

నందవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నందవరంలో మాజీ సర్పంచ్ ఈరమ్మ సోమవారం మృతి చెందింది. ఈమె మృతి టీడీపీ పార్టీకి తీరనిలోటని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఎమ్మిగనూరు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ దేశాయి మాధవరావు అన్నారు. సోమవారం ఆమె మృతదేహానికి నివాళి అర్పించారు. టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, మల్ల, ఈరన్న, శ్రీనివాసులు, నరసింహులు పాల్గొన్నారు.

ప్రగతి నివేదికలు అందజేత



ప్రగతి నివేదికలు అందుకున్న చిన్నారులతో ఎంఈవోలు

పెద్దకడుబూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పెద్దకడుబూరు మండలంలోని 49 అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు సోమవారం ప్రగతి నివేదికలు అందజేసినట్లు ఎంఈవోలు రాంమూర్తి, సువర్ణలసునియం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు నిండిన విద్యార్థులకు 1వ తరగతిలో చేరేందుకు ప్రగతి నివేదికలు అందించామన్నారు. విద్యార్థులు త్వరలో ప్రారంభమయ్యే పాఠశాలల్లో చేరేందుకు ఈ ప్రగతి నివేదికలు అవసరం అవుతాయన్నారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలు అధికం : ఏఐకేఎస్

గోనెగండ్ల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చేపడుతున్న రీ సర్వేతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, సర్వేల కారణంగా సమస్యలు తీరేది పోయి పెరుగుతున్నాయని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పంపన్న గౌడ్, సీపీఐ సీనియర్ నాయకులు మద్దిలేటి నాయుడు, బేతాళ పెద్ద బాషా అన్నారు. సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది డిసెంబరు నుంచి గోనెగండ్లలో భూ సర్వేలను రెవెన్యూ అధికారులు చేస్తున్నారని అన్నారు. సర్వేలో ఒక రైతుకు భూమి ఎక్కువ మరో రైతుకు భూమి తక్కువ వస్తుందని, ఇలా ప్రతి రైతుకు 10నుంచి 50 సెంట్ల వరకు ఇలా తక్కువ వస్తుందన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ ఆడగంల్ ప్రకారం భూమిను సరిచేయాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ విష్ణుకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రాజశేఖర్‌ఆచారి, గొల్లనాగన్న, కటికే ఖాజాబంద, రైతులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

పర్సంటేజీ నిబంధనలు తొలగించాలి



మాట్లాడుతున్న ఆర్‌వీఎఫ్ నాయకులు

మంత్రాలయం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 2025 డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఇంటర్, డిగ్రీ, పీజీలో 50 శాతం మార్కుల పర్సంటేజీ నిబంధనలను తొలగించాలని ఆర్‌పీవీఎఫ్ జిల్లా కార్యదర్శి ఖాజా, జిల్లా నాయకులు మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం మంత్రాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షను ఆఫ్‌లైన్‌లోనే నిర్వహించాలని కోరారు. పర్సంటేజీ నిబంధనల వల్ల ఎనిమిది లక్షలమంది అభ్యర్థులు నష్టపోతున్నారని, నిరుద్యోగుల భవిష్యత్తుపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు రాజేష్, రవి, వీరేంద్ర విద్యార్థులు పాల్గొన్నారు.

ఘర్షణలకు దూరంగా ఉండాలి: సీఐ



గాజులదిన్నెలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ విజయభాస్కర్

గోనెగండ్ల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు ఘర్షణలకు దూరంగా ఉండి ప్రశాంతమైన జీవితం గడపాలని గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ సూచించారు. సోమవారం సాయంత్రం గాజులదిన్నె గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో కొంతమంది గొడవలను సృష్టిస్తుంటారని వారి మాటలు నమ్మరాదన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుంటే తమ దృష్టికి తీసుకరావాలని సూచించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ విభాగ్ రాష్ట్ర కార్యదర్శిగా వెంకటేశ్వరరెడ్డి

పెద్దకడుబూరు, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ విభాగ్ రాష్ట్ర కార్యదర్శిగా దొడ్డిమేకల గ్రామం మాజీ సర్పంచ్ వెంకటేశ్వర రెడ్డిని వైసీపీ కేంద్ర పార్టీ కార్యాలయ పెద్దలు నియమించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తనను పంచాయతీ రాజ్ విభాగ్ రాష్ట్ర కార్యదర్శిగా నియమించేందుకు కృషి చేసిన మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసీపీ నాయకులు ప్రదీప్‌రెడ్డిలకు రుణపడి ఉంటానన్నారు. పార్టీ శ్రేయస్సుకు, ప్రజల పక్షాన పోరాటం చేస్తానన్నారు.

బయట పిల్లలను బడిలో చేర్పించాలి



సిరాలదొడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలని సిరాలదొడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కళావతి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని సిరాలదొడ్డి గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధుల్లో ర్యాలీగా తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు ఐదేళ్లు నిండిన తమ చిన్నారులను తప్పకుండ పాఠశా లలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు రాజు, భాస్కర్, వీరేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాల సేకరణ పూర్తి

గోనెగండ్ల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): స్టూడెంట్ ట్రాన్స్‌మిషన్ అండ్ హోలిస్టిక్ కార్డ్ ప్రక్రియను సోమవారం పూర్తి చేసినట్లు ఎంఈవోలు రామాంజినేయులు, నీలకంఠ తెలిపారు. మండల కేంద్రంలోని పలు వీధుల్లో ఎంఈవోలు, ఉపాధ్యాయులు తిరిగారు. 5వ తరగతి పూర్తి అయిన విద్యార్థులను ఆరవ తరగతిలో చేర్పించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలలో చదువుతున్న చిన్నారులను ఆయా ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ప్రతి గ్రామంలో ఉపాధ్యాయులు ఈ విధానాన్ని అమలు చేయాలని ఎంఈవోలు కోరారు.

జీవో నెంబరు 35 విడుదలపై హర్షం

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ జీవో నెంబర్ 35ను విడుదల చేయడం హర్షణీయమని ఎమ్మిగనూరు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది విజయలక్ష్మి, చెన్నయ్య, బసవ, సుభద్ర, శ్రీనివాసులు, వరలక్ష్మి, సుభాన్ అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలోనే అతిపెద్ద శాఖ అయిన పంచాయతీ రాజ్ శాఖలో పదోన్నతులు కల్పించేందుకు కృషి చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. సంస్కరణలో భాగంగా పంచాయతీ విస్తరణ అధికారి (పీఆర్ అండ్ ఆర్‌డీ)పోస్టును డిప్యూటీ ఎంపీడీవోగా మారుస్తూ ఎంపీడీవో పదోన్నతుల్లో ఈవో(పీఆర్ అండ్ ఆర్‌డీ)లకు 60శాతం చేస్తూ జీవోను జారీ చేయడం అభినందనీయమన్నారు. ఇందుకు కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.